# నీకేం కావాలి

## 1

నేను భావనారాయణను ఒక సంవత్సరంగా ఎరిగినప్పటికీ, మే మిద్దరమూ ఒక హోటల్లో ఫలహారం చేసి, ఒకే సెలూన్‌లో క్రాపులు చేయించుకుని, ఒకే లాండ్రీలో బట్టలు వేసుకుని, కలిసి సినిమాలకు వెళ్ళినప్పటికీ, మే మిద్దరమూ ఒకే ఆఫీసులో పనిచేస్తున్నప్పటికీ, మా స్నేహితం పరిచయాన్ని మించి వెళ్ళలేదు.

నిజానికి స్నేహితం ఇటువంటివాటితో కొలవదగిందికాదు. అంతరాత్మలను పంచుకొనేవరకూ పరిచయం స్నేహంగా మారదు. మే మిద్దరమూ, నాగరికత ఇద్దర్నీ ఎంత దగ్గిరికి తెస్తుందో అంతవరకే వచ్చాంగాని, హృదయాలు పంచుకుని ఎరగం లోక ధర్మంగా ఒకరినొకరం సంస్కరించుకోవాలని ప్రయత్నించికూడా ఎరగం.

అటువంటి స్థితిలో భావనారాయణ ఒక రోజున, హఠాత్తుగా తన హృదయం కాస్తా విప్పి నా ఎదట పెట్టేటప్పటికి నాకు ఏదో భయం వేసింది. కాని అతన్ని మాట్లాడవద్దనటంకూడా చాతకాలేదు.

"నాకు ఉన్నదే ఒక్క చెల్లెలు. ఆ ఒక్కతే నిరుడు చనిపోయింది. నేను బంధుప్రియుణ్ణి. కనకనే భగవంతుడు బంధువుల్లేకుండా చేశాడు...నా భార్య—ఆ విషయం తలచకుండాఉంటే మంచిది. నేను తొందరపడి ఆవిడ మీద నా అపేక్షంతా ఒలకబోశాను. మా ఆవిడ, ఊరికే వచ్చిన వస్తువు నెంతగా అవమానించవచ్చునో, అంతగా అవమానించింది నా అపేక్షను. చెంపలు వాయించుకున్నాను."

అతను నాకేసి చూడలేదు. నాకు ముళ్ళమీద ఉన్నట్లుంది. ఊఁ కొట్టడానికైనా నాకు సాహసం లేకపోయిందంటే నమ్మండి.

---

కొడవటిగంటి కుటుంబరావు

---

"నాకు పిల్లల్నయినా ఇవ్వలేదు భగవంతుడు."

మళ్ళీ ఆగాడు. అతని కళ్ళు నాకు కనిపించని దేన్నో లోపల చూసుకుంటున్నై.

నేను స్తంభించిపోయినట్టు కూర్చున్నాను. కదిలితే పేముకుర్చీ కిర్రుమని చప్పుడుచేసి అతని చిత్తప్రవృత్తిని అనుమాన పరుస్తుందేమోనని నాకు భయం వేసింది.

అకస్మాత్తుగా అతను నా కళ్ళకేసి చూసి, "నాకు మీ సలహా కావాలి! లేని వాటికి నేను విచారపడి ఏం లాభంలెండి? అది మీకు చెప్పి అంతకంటె లాభం లేదు. నాకిప్పుడు ఉన్నదాన్ని గురించిన చింత ఒకటి పట్టుకుంది!" అన్నాడు.

నేను ఆఖరుకు నోరువిప్పి, "ఏమిటా ఉన్నది?" అన్నాను. సహజంగా మాట్లాడాలనే ప్రయత్నంతో అవసరమైన ఉద్రేకం కాస్త కనబరుస్తూ.

"ఒక చెల్లెలు!" అన్నాడు భావనారాయణ.

"పోయిందన్నారుగా!"

"ఈ చెల్లెలు పోలేదు. ఈమె మా అమ్మకడుపున పుట్టినదికాదు."

మిగతాది నన్నూహించ నిచ్చాడు భావనారాయణ.

"ఎక్కడ ఉంటుంది? ఏం చేస్తుంది?" అన్నాను ఏదో అనాలనుకుని.

"బెజవాడ గాంధీనగరంలో, వృత్తిచేసుకుంటూ ఉంటుంది."

"ఓహో! అయితే—"

మిగతాది అతనికే వదిలాను.


"అవును!" అన్నాడతను. "అదే పెద్దచిక్కు!"

"ఒక విధంగా అదే మేలు. ఇంకే కులమైనా పైకి చెప్పుకునేటందుకూడా లేదు చూడండీ!" అన్నాను.

అతని కీ విషయం అదివరకు తట్టని వాడల్లే, "అదీ నిజమే!" అన్నాడు కొత్త ఉత్సాహంతో.

"మీ సమస్యేమిటో ఇంతకూ నేను సరిగా అర్థంచేసుకో లేదనుకుంటాను!" అన్నాను.

"ఆ మనిషి నా చెల్లెలు, ఆ మనిషిని తలుచుకున్నప్పుడు నాకు నిజంగా ఎంతో ఆనందం కలుగుతుంది. నా యీ చెల్లెలు పోయిన తరవాత ఆ చెల్లెలు ఎన్నివందలసార్లు జ్ఞాపకంవచ్చిందో చెప్పలేను. ఆ స్మరణ వచ్చినప్పుడు నా



గుండె ఎంతపీకుతుందోకూడా చెప్పలేను. నన్నా మనిషి తనఅన్నగా పరిగణించి, నాదగ్గిరికి అయిదారునెల్లకోసారి అయినా వచ్చి పదిరోజులపాటుండి, నాకు తన కష్టసుఖాలు చెప్పుకొని, నా కష్టసుఖాలువిని, నా ఆప్తురాలుగా ఉంటే నే నెంత ఆనందం పొందుతాను! ఇదివరకల్లా ఎట్లా జీవించినాసరే ఇక ముందు నా చెల్లెలు కాదగినట్టుగాజీవించేఆత్మ వికాసం ఆవిడకునేనుకలిగించగలనని నా వెర్రినమ్మకం. మాఇద్దరికీ ఈ ఎడబాటెందుకు? నాకు సంఘమంటేభయంలేదు. నిజంగా భయం లేదు. నాకు సంఘమే మేడిచింది? నా ఉద్యోగం నేను చేసుకుని నా పొట్ట నేను పోషించుకుంటున్నాను. నాకు ముందూ వెనకా ఎవరూ లేరు. చచ్చిపోయిన నా తల్లిదండ్రులు తల ఎత్తుకు తిరగటాని కుండదనా? పుట్టిన నా పిల్లలకు పెళ్ళిళ్ల కావనా? ఏమిటి చూసి నేను భయపడాలి గనక? అయినా మే మిద్దరమూ ఎడంగా ఉన్నాం. ఈ ఎడం తీసెయ్యడం ఎట్లాగో నా కర్థం కావటంలేదు."

"మీ రెప్పుడన్నా ఆవిడ దగ్గిరికెళ్ళి మాట్లాడలేకపోయినారా? మీకు సంఘ భయంకూడా లేకపోయినప్పుడు మిమ్మల్నడ్డేదేమిటి?" అన్నాను.

భావనారాయణ తలవంచి కాస్సేపు మౌనంగా ఉండి, ఆ తరవాత, "ఒక సారి వెళ్లాను. నేను ఫలానా పెద్దమనిషి కొడుకునన్నాను. వాళ్లు గుర్తుపట్టినట్టు కూడా పైకి కనిపించలేదు...తల్లీ, కూతురూ. కాని నాకు తెలుసు. మా నాన్న నాకు చాలా వివరాలుచెప్పాడు. ఇద్దరిపేర్లూ చెప్పాడు. పైగా ఆ పిల్లదగ్గిర మా చెల్లెలి కవళికలు లక్ష కనిపించినై!...పోనీ వాళ్లు కాదనుకున్నా, ఫలానివారి

కొడుకునంటే ఎరగని వాళ్ళయితే ఆయ నెవరనిగాని, అయితే ఎందుకొచ్చా వనిగాని అడగరూ? అదేమీలేదు. బెల్లంకొట్టిన రాళ్ళల్లే కూర్చున్నారు. ఒక్క పావుగంట వాళ్ళని చూస్తూ కూర్చున్నమీదట అక్కణ్ణించి లేచిరావటం నాకు తప్పనిసరి అయిందనుకోండి...నా మనస్సుకు నేను సరిచూచుకున్నాను. సాంఘి కంగా నేను వాళ్ళకేదో ద్రోహం చేశాను! అందుకు వాళ్ళు నన్నావిధంగా శిక్షిం చారు. నా ద్రోహానికి ఏం ప్రతిక్రియో తెలియలేదు. తెలిస్తే ప్రాయశ్చిత్తం చేసుకుందును."

కొంచెం సేపాలోచించి, పోనీ "మీ అభిప్రాయాలన్నీ ఒక ఉత్తరం రాసి-" అని ప్రారంభించాను.

"ఉత్తరంరాశాను. పదిహేనుపేజీల ఉత్తరం. దానికి పదిహేను రోజులవతల సమాధానం వచ్చింది—'మీకూ మాకూ ఏం సంబంధం? మా బతుకు మమ్మల్ని బతకనివ్వండి. అదే మాకు పదివేలు. ఏమైనా మా వల్ల తప్పులుంటే క్షమిం చండి' అని ఆ అమ్మాయి సమాధానం రాసింది. అంతటితో నా పని చిత్తయి పోయింది."

నేను విన్నది ఎంత వింతవిషయమో నా కిప్పటికిగాని పూర్తిగా తెలిసి రాలేదు. నాకు తెలియని దగ్గిరబంధువులూ దూరపుబంధువులూ దేశమంతటా ఉండవచ్చును. కాని నేను ఏ ప్రమాదవశానకూడా భావనారాయణపడ్డ దుస్థితిలో పడను. నేను భావనారాయణనైతే ఆ పిల్ల నా చెల్లెలే అని గుర్తేమిటి పొమ్మను కుంటాను. తన చెల్లెలిపోలికే నంటున్నాడు. నిజమే. కాని అంతఛాందసంలో పడ్డవాడికి అవతలి మనిషిలో ఏం కావాలంటే అదల్లా కనిపిస్తుంది.

ఇంతకూ భావనారాయణకు కావలసింది తన చెల్లెలుకూడా కాదు—ఒక చెల్లెలు! అతనికి లభ్యంకావటం ఎట్లా? నేనేమో సలహా ఇస్తానని అతను, పాపం నా దగ్గిరికి వచ్చాడుకాని, నాకు తట్టిన ఉపాయాలురెండూ అదివరకే అతనికి తట్టినై. అతనిఆశ అడియాసకాక తప్పదన్నట్టు కనిపించింది.

"ఇంకా ఆలోచించండి. మనస్సుంటే మార్గంలేకపోతుందా?" అని నేనతనికి ప్రోత్సాహం ఇచ్చాను.

"థాంక్స్!" అన్నాడతను, ఆ కాస్తకే రెట్టింపు ఉత్సాహం కనబరుస్తూ. "మీరు నన్ను చూసి నవ్వరనే ధైర్యంతోనే మీతో అదంతా చెప్పాను. మీరు కూడా అప్పుడప్పుడు ఆలోచించండి, ఏమైనా ఉపాయం తడితే నాకు వెంటనే చెప్పండి!" అన్నాడతను వెళ్ళిపొయ్యే ప్రయత్నంచేస్తూ.

"ఆ మనిషి పేరేమిటన్నారూ !"

"తల్లిపేరు రమామణి, కూతురి పేరు కస్తూరి."

## 2

అతను వెళ్ళిపోయిన మరుక్షణం నాకు వెధవ సందేహం కలిగింది. ఇతను కేవలం నా సానుభూతికోసం రాలేదుకద ! నిజంగా సలహాకోసం వచ్చి ఉంటాడా నిజంగా సలహాకోసం వస్తేనే, అతని సమస్యనుగురించి ఆలోచించటంవల్ల ప్రయోజనం ఉంది! సలహాకోసం వచ్చినవాడైతే సానుభూతితోనే అంత తృప్తి పడ్డాడేం ?

ఈ రెండు సందేహాల నడుమనూ చిక్కినవాణ్ణయి నేను భావనారాయణ సమస్యనుగురించి ఆలోచించినవాణ్ణీ కాలేదు, దాన్ని సుతరామూ విస్మరించినవాణ్ణీ కాలేదు. ఉన్నట్టుండి అకస్మాత్తుగా ఏమేమిటో ఆలోచనలు నా తలలో మెరిసేవి.

కస్తూరి ! ఏం పేరు ? ... మా ఇంటో వెనక కస్తూరి అనే కుక్క ఒకటి ఉండేది...

ఆ అమ్మాయి భావనారాయణకు రాసిన ఉత్తరంలో ఏదో గొప్పతనం లేదా ?...లేకపోతే నేను లేని గొప్పతనం చూస్తున్నానా ?

ఆ కస్తూరిలో - ఆ రమామణిలోనూకూడా-ఏదో మంచితనం లేకపోతే అతని ఉత్తరానికింకో విధమైన సమాధానం రాసి, అతన్ని చేరబట్టి పీలయినంత సొమ్ము చెయ్యలేక పోయినారా ?...

మాకూ నీకూ సంబంధం లేదనటంలో ఏదో గర్వం—అతిశయం కాదు, ఆత్మాభిమానం—లేదా ? ... భావనారాయణ తండ్రి రమామణికి ఏమయినా ద్రోహంచేసి ఉంటాడా ? భావనారాయణమీద వాళ్ళకదే కోపముయి ఉండరాదా ? ..

నన్ను మళ్ళీ పెళ్ళాడమని చాలామంది సలహా ఇస్తున్నారు. ఏ వితంతువునో పెళ్ళాడేబదులు ఆ కస్తూరినే—

వృత్తిలో ఉందికద !...ఏం ఉంటే ? శారీరకంగానూ, మానసికంగానూ, ఆధ్యాత్మికంగాకూడా మనిషిని నిలువునా మార్చెయ్యవచ్చునే !...ఒక విధంగా అంత అనుభవం వున్న మనిషి ఎంత చక్కని భార్య అవుతుంది !...

లోకమంటే భావనారాయణకు లేని భయం నాకెక్కడిది ? తన చెల్లెలు

కాదగిన అర్హత ఆమె కిప్పిస్తాననే ధైర్యం అతనికుంటే, నాకు భార్య అయే అర్హత నే నిప్పించలేనూ? ఏదైనా ఆధ్యాత్మికమైన చికిత్సేగా!...

ఇంతకూ ఆ మనిషి మనస్తత్వం ఎటువంటిదో! అసలు చూపుల కెట్లా ఉంటుందో! ఆమెను ఎవరంటిపెట్టుకొని ఉన్నారో! ఆమె వాతావరణం ఆమె కెంత తృప్తికరంగా ఉందో!...


ఈ మూఢుడు తన ఆనందంకోసం ఆ పిల్ల జీవితం దుఃఖభాజనం చెయ్యడు కద?...

అసలా కస్తూరి అనే మనిషి ఒకతె ఉందా లేక భావనారాయణ కల్పించాడా?... ఛీ! ఎందుకు కల్పిస్తాడు? ఏమిటా అనుమానం నాకు?...

ఇటువంటి ఆలోచనలతో రెండునెల్లపైగా గడిచింది. ఉన్నట్టుండి ఆ కస్తూరి నాకు చాలా దగ్గిరికి వచ్చినట్టయేది. ఏ నిద్రో మెలుకువవచ్చి ఆ మనిషిమీద భరించరానంత ప్రేమపుట్టేది. ఆ భావం నాకే అర్థం కాదు. ఈ విషయంలో భావనారాయణ నన్ను చెడగొట్టాడనుకుంటాను. అతను ఆమెమీద నా ఎదుట చూపిన ప్రేమాభిమానాలు నన్నునమ్మించి నాలో రహస్యంగా అసూయ రేపినై. నేను భావనారాయణ మీదికి అప్రయత్నంగా పోటీవెళ్ళి ఆ మనిషిని అతనికంటె ఎక్కువ ప్రేమించటానికి ప్రయత్నిస్తున్నాను.

నేను కాలేజీలో చదువుకునేరోజుల్లో ఇట్లాగే అయింది. మా క్లాసులో ఒక బ్రహ్మసమాజ మమ్మాయి ఉండేది. బాగుండేది కాదు. కాని చాలా మంచిదీ, చాలా తెలివిగలదీనూ. మొదట మా ముఠాలో అందరమూ ఆ పిల్లపేరు స్మరించి ఎగతాళి చేసినవాళ్ళమే. కొంతకాలం పోయిన తరవాత మా ఎగతాళి కృత్రిమ మనిపించింది నాకు. ఇతరులను చూసి నేనొకనాడు, "నోటివట్టం ఎందుకు? ఆ అమ్మాయి ఎంతమంచిది! నాకటువంటి చెల్లెలుంటే నేనసలు మీ అందరు వెధవలతోనూ మాట్లాడుదునా!" అన్నాను. మర్నాటినించీ ప్రతివాడూ ఆమె తన చెల్లెలంటే తన చెల్లెలని ఒకరిమీది కొకరు పోటీవచ్చి ఆ పిల్లను గురించి అసహ్యంగా మాట్లాడ్డం మరిచిపోయినారు.

అటుతర్వాత నేను కస్తూరి సంగతి సొంతం మరిచిపోయినాను. ఈలోపల నా జీవితానికో విషాదాంతమైన ప్రణయగాధ అడ్డుపడి మిగిలిన అంశాలన్నీ ముంచివేసింది. ఆ ప్రణయగాధ మూలంగా నా జీవితంలోనూ శరీరంలోనూ చాలా మార్పులు జరిగినై. నా వుద్యోగంకాస్తా అంతమయింది. చేతులోవున్న డబ్బుకూడా అయిపోయింది. పోతేపోయింది వెధవడబ్బు, నేను మళ్ళీ మామూలు




మనిషిని కాగలిగాను—దైహికంగానైనా. ఉద్యోగంకోసం వెతకటంలో మానసికంగానూ, ఆపైన పెండ్లి చేసుకొని ఆధ్యాత్మికంగానూ మంచివాణ్ణవుదామని తీర్మానం చేసుకున్నాను.

ఈ సమయంలో మా పెత్తండ్రిగారి దగ్గరనించి తంతి వచ్చింది. అర్జంటుగా బయలుదేరి గుంటూరు రమ్మని. బ్యాంకు ఎకౌంటు క్లోజుచేసి ఆ పదిరూపాయలు పుచ్చుకుని తీరిగ్గా ఒక వారంరోజులకు గుంటూరు ప్రయాణం కట్టాను. తంతి వచ్చిన మర్నాడే ఉత్తరంకూడా వచ్చింది. దాన్లో వివరాలన్నీ ఉన్నై. మా పెత్తండ్రిగారు పెంచుకుని పెళ్ళిచేసిన పిల్లవాడుకాస్తా న్యుమోనియా వచ్చి చనిపోయినాడు. కొన్ని వ్యవహారవిషయాలు మాట్లాడాలి రమ్మని రాశాడాయన ఆ ఉత్తరం చూసినా పోక అంత అర్జంటుగాదనీ, అప్పుచేసి బయలుదేరవలసినంత అగత్యంలేదనీ తీరిగ్గా బయల్దేరాను.

ఉన్న విషయం వెంటనే బయటపెట్టారు మా పెత్తండ్రిగారు. ఆయనకు మళ్ళీ ఇంకో కుర్రాణ్ణి పెంచుకునే ఆలోచనలేదట. ఇంకా కాపరానికిరాని తన కోడలికి వాళ్ళకిష్టమైతే తన చేతిమీదుగానే పెళ్ళిచెయ్యటమో, లేనిపక్షంలో ఆమెకు మనోవర్తికింద కొంత రాసివ్వటమో చేస్తానన్నారు. నన్నా పిల్లను పెళ్ళాడమన్నారు. ఇష్టమైతే. అంతచిన్నపిల్ల నాతో కాపరం చెయ్యలేదని చెప్పాను.

"సరే, నీ యిష్టం. నువ్వు బుద్ధిమంతుడివి. నా ఆస్తికూడా నీకే వదిలెయ్య

దలిచాను. మీ నాన్న నీకు దమ్మిడీ దక్కకుండా చేశాడు. నా ఇన్సూరెన్సు కూడా నీపేరే పెట్టేశాను. నీ కెప్పుడెంతడబ్బు కావలిస్తే అంతడబ్బు నా దగ్గర్నించి పుచ్చుకుంటూ నీకు తీరిగ్గా ఉన్నప్పుడే ఇంటికివచ్చి ఈ కుర్చీలో కూర్చొని, నీ బట్టలీ వొంకెలకి తగిలించి, ఈ మంచాలమీద పడుకుంటూ ఉండు. చాలాకాలమై నేనే నీకు తండ్రిని. ఇకనుంచీ నువ్వే నా కొడుకువి సరా?" అన్నారు.

ఆయన ప్రేమకన్న, దాని ప్రకటన నన్ను అమితంగా కదిలించింది.

"మీ యిష్టం నేను కాదంటానా? డబ్బు ఖర్చుచెయ్యటంలో నేను నాన్నగారి కేమీ తీసిపోలేదు. చెక్కుబుక్కు కడిగితేనేగాని నాకు రైలుచార్జీ లేకపోయింది." అన్నాను.

ఆయన పాపం వెంటనే పది పదిరూపాయల కాగితాలు తీసి నాకిస్తూ, "దగ్గర ఉంచు, నేను బతికుండగా నువ్వు డబ్బుకోసం ఇబ్బందిపడకుసుమీ: నా తదనంతరం నీకా బాధ ఉండకుండా ఎట్లాగూ చూస్తాను!"

మనం ఫెయిరీటేల్సు అబద్ధమని ఎందుకనుకుంటామో నాకర్థం కాలేదు. అప్పుడప్పుడూ దేవతలు బట్టతలతోనూ రంగువేసిన మీసాలతోనూ ఉండి, పోలీసుద్యోగంచేసి, లంచాలుపట్టి, బాగా ఆర్జించి, రిటైరయి ఉంటారని నాకు బోధపడింది. దేవతలుమాత్రం మన ఐహికవాంఛలనేకదా తీరుస్తారు? మనం ఫెయిరీటేల్సు చూసి అభూతకల్పనలనుకోవటందేనికీ?

## 3

నా భావి కార్యక్రమం మా పెత్తండ్రిగారికి విన్నవించాను. నా వుద్యోగం పోయింది. కనీసం ఒక సంవత్సరంపాటు నాకు ఉద్యోగం లేకుండా వుందామని వుంది. ఈ సంవత్సరంపాటూ దేశం తిరుగుదామని వుంది. ఆ దేశాటన కాగానే నా కిష్టయిన దాన్ని చేసుకొని ఒకచోట స్థిరపడి, ఆమీద నాకు నచ్చిన వ్యాపకం ఏదైనా అవలంబింతామని వుంది.

ఈ కార్యక్రమం చాలా బాగుందన్నారు మా పెత్తండ్రిగారు. ఆయనకూడా సరిగా అదే అనుకున్నట్టు.

ఆయన్ను గమనిస్తుంటే అకస్మాత్తుగా నాకు భావనారాయణ జ్ఞాపకం వచ్చాడు. అతను ఏ బంధుప్రేమతో బాధపడుతున్నాడో అటువంటి ప్రేమే మా పెత్తండ్రిగార్ని కూడా బాధిస్తూ వుండాలి. కాని ఆయన ఒకప్పుడిట్లా లేరు. పరమ కర్కోటకుడనిపించుకున్నారు. దుర్మార్గుడని కూడా అనిపించుకున్నారు.

కాని ఏ నిమనిషిలో ఏ దౌర్బల్యం వుంటుందో, అది ఎప్పుడెంత ఆకర్షణీయంగా బయటపడుతుందో ఎవరు చెప్పగలరు ?

నే నక్కడ వున్న పదిహేనురోజుల కాలంలోనూ కనీసం ఐదారు సార్లు ఆయనకేసి చూసి, "ఆయనకు నిన్ను ఆలింగనం చేసుకుందామనిపిస్తున్నది ! రక్తస్పర్శ !" అనుకున్నాను.

నా ప్రయాణానికి బోలెడంత సరంజామా కొనిపించారు మా పెత్తండ్రిగారు. ఇవన్నీ ఎందుకండీ అంటే వినలేదు. రైలు ఎక్కేటప్పుడు కూడా ఆయన రైలు దగ్గరకు వచ్చి బెజవాడకు సెకండు క్లాసు టిక్కెట్లు కొనిపించారు. డబ్బు ఖర్చవుతుందని తక్కువటిక్కెట్టు కొనవద్దన్నారు. ఈ ప్రయాణంలో నా ఆరోగ్యం ఏమాత్రం చెడినా క్షమించనన్నారు. ప్లాట్‌ఫారంమీద ఆయన కనబడినంతసేపూ కిటికీదగ్గర నిలబడి, ఆ తరవాత సీటులో కూచుని, నిట్టూర్పువిడిచి నన్ను నేను సింహావలోకనం చేసుకున్నాను.

నాకు జరిగిన ఈ కొత్త అనుభవం ఏమిటి ? దీని అంచనా ఏమిటి ? అపస్వరం పలికిన ఒక ప్రయాణానుభవమూ, దాని వెనకడితే తరుముకొచ్చిన కష్టాల పరంపరా, నాలో తీసుకురాలేని మార్పు—ఒక ముసలివాడి మూఢప్రేమ ఎందుకు తీసుకొచ్చింది ? ఈ లోపల నాలో కలిగిన మార్పల్లా మానవుడి మంచితనంలో నా కేర్పడిన విశ్వాసమే ! ఈ విశ్వాసం ఇంతమార్పు తెస్తుందా ? లేక ఇది ఇటీవల నాకు సంక్రమించిన డబ్బా !

ఏది జీవితాశయం ! ప్రేమా, డబ్బా ?

ప్రేమా ! డబ్బా ! రెంటినీ తుస్కారించే వాళ్ళున్నారు. మానవుడి మతమూ, విశ్వాసాలూ, నాగరికతా, సంస్కారమూ - అన్నీ ఆర్థికమైనవే నంటారు సోషలిస్టులు.

జీవితాశయం ఆత్మకు సంబంధించినది. ఆ ఆత్మ వికాసం కలిగితే డబ్బా, తెలివితేటలూ, విజ్ఞానమూ ఇవ్వలేని అద్వితీయమైన ఆనందమేదో కలుగుతుందంటారు వేదాంతులు.

ఏది నిజం ?

డబ్బా, ప్రేమా—ఈ రెండు మాటలు నా తలలో తిరిగి తిరిగి ఆఖరుకు నా ఆలోచన వేశ్యలమీదికి మళ్ళింది. ఆ వేశ్యలో ఈ రెంటినీ కలిసికట్టుగా చూడవచ్చు.


వేశ్యప్రేమ డబ్బుతో కొనుక్కోవచ్చు. అది నిజమైన ప్రేమ కాదంటారు కొందరు. వేశ్య అందరిమీద చూపేది నిజమైన ప్రేమ కాకపోవచ్చు. కాని ఆ మనిషిలోకూడా నిజమైన ప్రేమ ఎక్కడో వుంటుందిగా. అది ఎప్పుడోప్పుడు బయటపడకపోదుగా! అప్పుడది ఎవరిమీద బయటపడుతుంది? పని పెట్టుకొని డబ్బివ్వనివాడిమీద పడుతుందా?

నా బుద్ధికీ రెండవ ముక్కే నిజ మనిపించింది. ఆర్థికసమస్య తాత్కాలికంగా తీరిందికనక నేను సోషలిస్టులతో ఏకీభవించాను. ఆలోచించిన కొద్దీ అదే సరిగా కనపడ్డది. అసలు ప్రేమలో ఎప్పుడూ స్వార్థం వుంది. ఎవరో కథకుడన్నట్టు ఎంత మిన్నుముట్టిన మహావృక్షమయినా జన్మించేది మట్టిలోనే అయినట్టు, అతి వున్నతంగావెళ్ళే ప్రేమకుకూడా వేళ్ళు స్వార్థంలోనే ఉంటై. ప్రేమకూడా డబ్బులో మొలకెత్తవలసిందే! ఎటువంటి ఆడదైనా, తన ఆర్థిక సమస్యల భారం మోసే మగవాణ్ణి, ఎటువంటి వాడయినా సరే, ప్రేమించకుండా ఉండలేదు. అటువంటి ఆడది ఉంటే అది శిలేగాని మనిషి కాదు. ఆ విధంగానే ఎంత గాఢమైన ప్రేమ అయినా సరే ఒక్క చుక్క లోభత్వం తగలగానే విరిగి ఊరుకుంటుంది. స్వార్థత్యాగం చేయించే ప్రేమకూడా స్వార్థంలో అంకురించి తీరవలసిందే.

పాపం! భావనారాయణ అమాయకుడు. అతను తన ప్రేమ ప్రకటించుకున్నాడు గాని, అతని ఉత్తరం కంటె ఒక పదిరూపాయలు మనియార్డరు ("నా పేర నీ యిష్టంవచ్చిన చీరో, వస్తువో కొనుక్కో!") అది కస్తూరిని ఎక్కువగా విశ్వసింప జేసి ఉండును.

ఈ ఆలోచనవెంటే మరో మహత్తరమైన ఆలోచన వచ్చింది—నాకు. ఎవరో, అడక్కుండానే ఇంత ఉపకారం చేస్తున్నప్పుడు, నా దగ్గరికి పనిపెట్టుకు వచ్చి నాతో తన హృదయమంతా విప్పి చెప్పుకొని, సహాయం అర్థించిన భావనారాయణకు నే నెందుకు వుపకారం చెయ్యటానికి ప్రయత్నించరాదూ? రూపాయికీ రెంటికీ ఒళ్ళమ్ముకునే మనిషిని నేను నా దగ్గరవున్న డబ్బుతో కొనలేకపోతానా? ఆ తరవాత ఆమెను భావనారాయణ పరం చెయ్యటానికి అరక్షణం పట్టదు! నాకు మా పెత్తండ్రి గారిచ్చిన ఆనందం నేను భావనారాయణకు ఇచ్చి తీరాలి.

నేను బెజవాడ స్టేషనులో దిగి సామాను అక్కడి రిటైరింగ్ రూములోనే పారేసి బండి చేసుకుని గాంధీనగరానికి బయలుదేరి, బండివాడి ద్వారానే రమామణి ఆచోకీ తీశాను. వాడికి కస్తూరి పేరు తెలుసు. ఆ పేరు చెవిన




పడగానే బండివాడు శరవేగంతో ఒక డాబాముందు నిలబెట్టాడు. నేను బండివాణ్ణి పంపేసి దర్జాగా తలుపు తట్టాను. లోపలినుంచి శ్రావ్యమైన కంఠం "ఎవరూ ?" అని పలికింది.

ఆ క్షణాన నాలో నేను నవ్వుకున్నాను. నన్ను చూడగానే ఆ తలుపు తీసే రమామణో; కస్తూరో, చిక్కిందిరా చాప అనుకుంటుంది గామాలు ! పాపం దానికేం తెలుస్తుంది—ఇటీవల నేనెంత పెద్ద మనిషినైనానో, నేనేం పనిమీద వచ్చానో ?

తలుపు తెరిచిన మనిషి రమామణీ గాదు, కస్తూరీ గాదు. రమామణి ఎంత చిన్నదయినప్పటికీ ఇంత చిన్నదయి ఉండదు. కస్తూరి ఎంత అనాకారిదయినా ఇంత అనాకారిదయి ఉండదు. నాలో అణిచినా అణక్కుండా పైకుబికే ఉత్సాహంతో, "మనసా ఊరడిల్లు మూరడిల్లుము" అనుకున్నాను.

ఆ తలుపు తెరిచినమనిషి నన్నుచూసి గుర్తుపట్టినట్టుగా నవ్వి, "దయ చెయ్యండి. అక్క బువ్వొండుతోంది," అన్నది. నేను కొంచెం కంగారుపడుతూ ఆ మనిషివెంట లోపలి కెళ్లాను.

లోపల హాలు కొంతవరకు నాజూకుగా వుంది. కొత్తఫాషను కుర్చీలూ, సిగరెట్టుపొడి రాల్చేటందుకో ఏర్పాటూ అదీ అంతా అట్టహాసంగావుంది.

నేను కుర్చీలో కూలబడ్డ మరుక్షణంలో ఒక వయసుమళ్ళిన స్త్రీవచ్చి, "అమ్మాయితో మాట్లాడ్డానికి వచ్చారా ?'' అంది.

"కాదు నీతోనే!" అన్నాను.

"నాతోనా? చెప్పండి!" అంటూ ఆ మనిషి ఒక నాలుగుకాళ్ళ పీట నాదగ్గిరి కీడ్చి కూచుంది, ఒళ్ళో చేతులు పెట్టుకుని కళ్ళు నాకు వప్పగించి.

"నేను దేశం తిరిగి రాబోతున్నాను ఆరునెల్లపాటు. మీ కస్తూరిని నావెంట పంపుతావా ?"

"మందేవూరు, బాబూ ?''

"గుంటూరు "

"ఏం వుద్యోగం? వ్యాపారమా ?"

"డబ్బు ఖర్చు చెయ్యటం."

"డబ్బుండారి కేమైనా చెల్లిపొద్దిలే! అయితే యే దేశ మెల్తుండారు ?"

"ఏ దేశమూ లేదు. ఈ దేశమే. కలకత్తా, ఢిల్లీ, ఆగ్రా, బొంబాయి, పూనా- అన్నీ తిరిగివస్తాను. వెంట కస్తూరి వంటిది, మంచి అందగత్తా, తెలివి గలదీ ఉంటే బాగుంటుందనిపించింది. వీలుపడుతుందో లేదో, వీలుపడితే ఏ మాత్రం ఇవ్వవలసిఉంటుందో చెబితే —''

"మరేం లేదుగాని, నాయనా! ఊరంతా బాకీలుజేసి కూకుంది! మీ యెంటెల్లి పోయిందంటే బాగీ ఎగేసి పారయిందంటారు. ఆటికిస్తే చాలు. మీ యెంటున్నప్పుడు కూటికి గుడ్డకి లోపవేంటిలేగాని-మొదలు మీ యెంటొస్తానంటదో, రానంటదో! తిక్కలంజ! ''అని ముసలిది ఒక్కగుక్కలో ఎనిమిది రకాల భావాలు ప్రకటించింది.

''బాకీ లెంతవుంటై ?'' అన్నాను. అభిప్రాయం లాగుదామని.

"ఉండకేం! ఎంతయీనంగా జూసినా రొండొందలేబయికి తగ్గవ్, ఇంకా పైసిలుకే వుండొచ్చునో అదంతా దానికే తెలుసు. నువ్వోపన్జెయ్యి, బాబూ! దీపాలెట్టేయాల ఓ పాలొచ్చి కనపడితే ఈలోగా దానికి నచ్చజెప్పంచుతా అప్పుడే సూద్దాం, అదికూడా ఏమంటదో ?''

తీరా నేను బయలుదేరే సమయానికి ముసలిదానికి మళ్ళీ నేను కనిపించనేమో నని భయం వేసిందో ఏమో, "దీపాలెట్టేయాల కొస్తారుగా! మొదలు మీ రెల్లటమూ, దీన్ని యెంటెట్టుకెల్లటమూ కరారేనా ?'' అన్నది ఆదుర్దాగా.

''నేను వేళాకోళాని కడిగినా ?" అన్నాను.

"పోనీ, ఓపాలి కస్తూరిని పిలుద్దునా?" అన్నది ముసల్ది.

"ఏమీ అక్కర్లేదు, నేనారింటికి తప్పకుండా వస్తాను. ప్రయాణం తెల్లారగట్ట మెయిలుకు."

ఆరుగంటలకు నేను వెళ్ళేటప్పటికి కస్తూరి బాగా ముస్తాబై ఉంది. ఆ మని షిలో అందంకంటె కూడా భిన్నమైన ఆకర్షణ చాలాఉంది. అన్నకావటంవల్ల భావనారాయణకది కనిపించిఉండదు.

కస్తూరి నన్ను బాతాఖానిలోకి దించాలని ప్రయత్నించిందిగాని, నేను చాలా తొందరపనిమీద వున్నవాడల్లే వ్యవహారం మాట్లాడేశాను. కస్తూరికి నెలకు వంద చొప్పున ఇస్తానన్నాను, నా ప్రయాణం ఆరునెల్లకన్న పట్టదన్నాను. ఈ లోపలే అయిపోవచ్చు నన్నాను. నా వెంట ఈ వేషంతో రావటానికి వీల్లేదన్నాను. పైకయినా సంసారంచేసే మనిషల్లే కనపడాలన్నాను. ఈ ముక్క ఆ ఇద్దరికీ ఎంతో అనుమానం కలిగించింది. ఎందుకో నా కీ నాటికీ అర్థం కాలేదు. కస్తూ రిని అనవసరంగా కష్టపెట్టనన్నాను. ఆమెకయ్యే ఖర్చంతా నేనేభరిస్తానన్నాను. వెంట ఏమీ తీసుకురానక్కర్లేదన్నాను. ఖరీదైన నగలుకూడా ఇంటిదగ్గరే విడిచి రమ్మన్నాను. నా వెంట తిరిగినన్నాళ్ళు కస్తూరి తన వృత్తి మరిచిపోయి, నన్ను కూడా ఆకర్షించటానికి ఎటువంటి ప్రయత్నమూ చెయ్యరాదన్నాను. ఈ కండి షనుకూడా వాళ్ళకి చాలా అనుమానం కలిగించింది. అది తీసేస్తేగాని కస్తూరి రానంటుందేమోననికూడా నాకు కొద్దిగా అనుమానం తట్టింది. కాని చివరకంతా సెటిలయిపోయింది.

ఆపూట అక్కడ పడుకోనన్నాను కస్తూరిని బండివేసుకుని స్టేషనుకు రమ్మ న్నాను. ఒక వందరూపాయలు ముసలిదానికిచ్చి కస్తూరిదగ్గర సక్రమమైన రశీదు పుచ్చుకున్నాను.

ప్లాటుఫారంమీద కస్తూరిని చూసేవరకూ నాకు ఆ మనిషి అన్న ప్రకారం వస్తుం దని నమ్మకం లేకపోయింది.

మేమిద్దరమూ సెకండుక్లాస్ కంపార్టుమెంటులో ఎక్కికూచుని రైలు కదిలి బెజవాడ స్టేషను వెనకపడిపోగానే నాలోనుంచి ఏదో దడ ప్రారంభమయింది. నా ఎదురుగా ఉన్న కస్తూరి ఏదో పులిమాదిరిగా కనిపించింది. నన్ను చూసికూడా నేను దడుచుకున్నాను. నా ప్రయత్నమంతా ఒక ఉన్మత్తుడి భావం మాదిరిగా కనిపించింది. నాకెప్పుడు మనస్సు మారితే కస్తూరిని ఇంటికి పంపెయ్యవచ్చు గదా అన్న ఆలోచనలవల్లకూడా నాభయం చల్లారలేదు.

నేనెవణ్ణి? విధిచేతి కీలుబొమ్మను. నే ననుకొనేదీ అనుకోనిదీ ఒక్కదమ్మిడీ విలవచెయ్యదు. ఈ మనిషిని విధి నాకెందు కంటగట్టింది ? ఈ కస్తూరి నన్నింతగా ఆకర్షిస్తుందనుకుంటే ఇంతపని చెయ్యక పోదును.

## 4

నేను కోరినప్రకారం కస్తూరి తన మామూలువేషం మార్చి కొంతవరకు సంసారపక్షంగా తయారయింది. జుట్టు పక్కపాపడిమార్చి మధ్యపాపడి తీసి వదులుగా జడవేసింది. చెవుల లోలాకులు తీసివేసింది. చేతులకు రెండుజతలు గాజులూ ఒక తెల్లరాతి ఉంగరమూ, మెళ్ళో ఒక సన్న గొలుసూ, చుట్టిన పగడాలూ మాత్రం ధరించింది.

"నువ్వదివరకెప్పుడన్నా పెద్ద ప్రయాణాలు చేశావా ?" అని అడిగాను కస్తూరిని.

"లేదు. రెండుసార్లు లండను మాత్రం వెళ్లాను," అన్నది.

అడుగులోనే హంసపాదు. నన్ను చూసి కస్తూరి గౌరవించి, నాదగ్గర గంభీరంగా మాట్లాడాలని నా తాత్పర్యం. అడిగిన మొదటి ప్రశ్నకే ఇటువంటి వెకిలి జవాబివ్వటం నాకు నచ్చలేదు. అయినా నేనామెతో గంభీరంగా ఉంటే ఆవిడ నాతో వెకిలిగా ఎంతసేపుంటుందీ ?

"ఎవరితో ?" అన్నాను.

కస్తూరి చెయ్యి నావేపుచాచి "ఏమిటండీ ?" అన్నది. అంతచాదస్తంగా అడుగుతావేమన్నట్టు.

"ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళలేదా ?" అన్నాను.

"నాబొంద ! నేనెక్కడికి వెళ్తానూ ?"

"నీకు దేశంమీద తిరగటం ఇష్టమేనా ?"

"తినబోతూ రుచులడగటం దేనికి ? అదికూడా ఎట్లాఉంటుందో చూడబోతున్నానుగా. కొంత తిరిగిన తరువాత చెబుతాను".

అప్పటికా సంభాషణ అయిపోయింది. మళ్ళీ కాసేపుండి నేను, "ఎవరితోనూ చెప్పకుండా వచ్చావుకదా, నిన్ను నమ్ముకున్న వాళ్లెవ్వరూ లేరూ ?" అన్నాను.

"ఉంటే ?"

"ఆర్నెల్లపాటు నీవు మాయమైతే వాళ్ళందరికీ కోపంరాదూ? మళ్లీ నీవు కొంప చేరుకునేటప్పటికి పాత ఖాతాలన్నీ పోతయ్యేమో !"



"పోతే పోతై. నాకు ఒకరి అదుపేమిటి? అట్లా అదుపుచేసేవాళ్ళని నేను గడపతొక్కనీను. స్వతంత్రంగా ఉండటంకోసమని బంగారమంటి వాళ్ళని వొదులుకున్నా. ఆ తిరపతిరాయుడు పదివే లిస్తాననొచ్చాడు. కాని ఘోషపెట్టి చంపుతాడు, వాడి దీపమారా! అదివరకు సుబ్బుల్ని అలాగే కోసుకుతిన్నాడు. వాడికి ప్రతిదీ అనుమానమే. చచ్చేటట్టు తంతాడు కోపమొస్తే. మీరు తిరపతి రాయుణ్ణెరుగుదురా? పొట్టిగా, పచ్చగా, గిరజాల జుట్టూ—"

''ఎరగను.''

''పోనీ, సుబ్బులెన్నెరుగుదురా ? కొంతకాలం ఆ వేషాలేసే వీరభద్రరా వుంచు కున్నాడూ—''

''తెలీదు.''

కస్తూరి సంభాషణ చాలించి కిటికీలోనుంచి బయటికి చూడటం మొదలు పెట్టింది.

"జాగర్త కళ్ళల్లో బొగ్గుపడుతుంది. చూడదలుచుకుంటే వెనకవేపు చూడు, ముందుకు చూడకు."

నే నన్నంతపనీ అయింది. కస్తూరి తల లోపలికిలాగి కుడికన్ను గబాగబా నలుపుకోసాగింది.

''ఉండుండు ! అట్లా కన్ను నులిపితే కుదప కడుతుంది. నలక అసలే రాదు.''

కస్తూరికి నేను సహాయం వెళ్లాను. జాగ్రత్తగా రెప్పపైకెత్తి అంతటా చూశాను. నలక కనిపించలేదు.

"ఎక్కడో పైగా ఇరుక్కుంది !" అన్నది కస్తూరి దగ్గిరిగా జరిగి నన్ను ఆనుకుంటూ.

"ఎందుకు దొంగవేషాలు వేస్తావ్ ? నీ కంట్లో నలకపడితే కంట్లో తడేది ?" అన్నాను.

"మీ కన్నీ తప్పేనే ! నలక నలపటంలో పోయింది గామాలు !" అంటూ కోపంనటించి కస్తూరి ఎడంగా జరిగింది.

ఆ తరువాత ఏలూరు స్టేషను వచ్చేవరకూ కస్తూరి నన్ను ఎన్నోవిధాల ఆకర్షించటానికి ప్రయత్నించింది. నన్ను ఎంతోకాలంనుంచి ఎరిగినట్లు ప్రవర్తించ సాగింది. నర్మంగా, వ్యంగ్యంగా మాట్లాడసాగింది. కాని నేను బిగుసుకుపోయి నాను. తన వృత్తిని ఆ మనిషి మరిచిపొయ్యేవరకూ, ఆమెతో నేను మనస్పిచ్చి మాట్లాడదలచలేదు.

ఏలూరు స్టేషనులో ఇద్దరు దంపతులు మా కంపార్టుమెంటులో ఎక్కారు. ఆయన్ను సాగనంపటానికి వచ్చిన పరివారంచూసి ఆయన మునసబు అయి ఉంటాడనుకున్నాను.

ఆ దంపతులిద్దరూ నడివయస్సు దాటినవారు. ఆయన కాయసారుగా ఉన్నాడు గాని ఆవిడ కస్తూరికి రెండింతలమనిషి. మొదటినుంచీ కస్తూరికేసి ఆయన

దొంగతనంగానూ ఆవిడ కోపంగానూ చూడసాగారు. కస్తూరి గూడా నన్ను తృణీకరించి వాళ్ళను పరీక్ష చెయ్యసాగింది,

కాస్సేపుండి మునసబుగారు అప్రయత్నంగా ఒక పెద్ద నిట్టూర్పు విడిచాడు. వెంటనే ఆయన భార్య మేం వింటున్నా మనికూడా లక్ష్యం చెయ్యకుండా, "పాపం ఎంతకష్టం వచ్చిందండీ!'' అన్నది.

ఆయన ఒకసారి నాకేసి చూసి తరవాత భార్యకేసి చూసి కళ్ళు మూసుకున్నాడు.

ఆ దంపతులను చూస్తే నాకు జాలేసింది. అందరి మాదిరిగానే వాళ్ళుకూడా బందిఖానాలో ఉన్నారు. ధనికులూ పెద్దపాయవాళ్ళూ కనక మరింత బందిఖానాలో ఉన్నారు. చదువుకున్నది కనక ఆవిడ కాత్మజ్ఞానం ఉంది. తనవల్ల భర్తకు సుఖంలేదని తెలుసు. తను ఆయనకు సుఖంలేనందుకు ఆయన్నావిడ క్షమించలేదు. సెకండుక్లాసులో ప్రయాణం చెయ్యటం అలవాటు కనకనూ, ఇంటిదగ్గర తన ప్రవర్తన గమనించే నౌకర్లు తన్ను చూసి ఏమనుకున్నా ఆవిడకు నష్టంలేదు కనకనూ, ఆవిడ ఆత్మనిగ్రహం నేర్చుకోలేదు. తనకు పిల్లలులేరు. అందుక్కూడా ఆవిడ భర్తనే నిందిస్తుంది. తక్కువ కులంవాడల్లే భర్త తనను తిట్టడు, కొట్టడు. తన నోటిని నిగ్రహించేటందు కావిడకు ఎటువంటి ఆవశ్యకతా లేదు.

నేను వైద్యుణ్ణయితే ఆ దంపతులకు ఒక సంవత్సరంపాటు దారిద్ర్యమూ, మూడోక్లాసు ప్రయాణమూ, వాళ్ళ సమస్తులతో ఏక గృహవాసమూ విధిస్తాను. ఇతరుల అభిప్రాయాలను మన్నించడం అప్పుడుగాని ఆవిడ నేర్చుకోదు. అనరాదుగాని నావెంట ఉన్న కస్తూరి ఆవిడకంటె లక్షరెట్లు నయం. కస్తూరిని శిక్షించ నవసరంలేకుండానే మంచిమనిషి అవుతుంది. ఆ యిల్లాలికి శిక్షతప్పదు. కస్తూరికి నీరసం---ఆహారంతో సరిఅవుతుంది. ఆ మునసబుగారి భార్యకు రుగ్మత---మందుపడాలి.

ఒక్క సంవత్సరంపాటు జయప్రదంగా శరీరం అమ్ముకొని బతకగలిగిన మనిషికి మనిషిలోఉన్న క్షుద్రత యావత్తూ అర్థమౌతుంది. కస్తూరికి నా మంచితనం ఒకవేళ అర్ధంకాకపోయినా ఆ మునసబుగారి భార్యలోవున్న కుళ్ళు అర్థమయింది. ఎప్పుడైతే ఆ యిల్లాలు మొగుడిమీద తన విషం వెళ్ళగక్కిందో ఆ వెంటనే కస్తూరి ఆవిణ్ణి పలకరించి మాట్లాడసాగింది.

కస్తూరితో మాట్లాడడం ఆవిడ కిష్టం లేదు. ఆవిడ ప్రాణానికి కస్తూరీ, ఒక

నల్ల అడకుక్కా ఒకటే. ఆ క్షణాన కస్తూరి శాపహతురాలై నిలువునా భస్మ మయినా ఆవిడకు దిగుల్లేదు సరికదా ఆవిడ కళ్ళు చల్లగా ఉంటై. ఆవాళ ఉదయం లేచి ఏదో పాపిష్టి మొహం చూడటంవల్ల ఈ కస్తూరి ఆవిడకు దాప రించింది. కస్తూరివంటి వాళ్ళు ఒకరిద్దరన్నా ఉండటంవల్లే ఇది కలియుగ మయింది. ఇటువంటి మధురభావాలు ధ్వనించే గొంతుతో ఆవిడ కస్తూరి ప్రశ్న లకు సమాధానం ఇచ్చింది. కస్తూరి ఆవిడ పైకి అనకుండా ప్రకటించే భావాలను అర్థంచేసుకోనట్టు మరింత ఉత్సాహంగా మాట్లాడటం మొదలు పెట్టింది. చివరి కావిడ నిర్మొగమాటంగా కస్తూరి ప్రశ్నలకు సమాధానం ఇవ్వటం మానేసి కిటికీలోనించి బయటికి చూడటం మొదలుపెట్టింది.

కస్తూరి చప్పున నా దగ్గరికి వచ్చి కూర్చుని, "ఇప్పుడావిడ కంట్లో నలక పడబోతున్నది. చూస్తూ ఉండండి" అన్నది రహస్యంగా, మునసబుగారు తనని కళ్ళతో తినేస్తూ వుండటం గమనించకుండా.

నేను అప్రయత్నంగా, "దొంగ కొరివి" అనేశాను.

కస్తూరి కళ్ళలోకి విజయసూచకమైన కాంతి వచ్చింది. ఇంతలోనే మునసబు గారి భార్య తల లోపలికి తీసి రెండు కళ్ళూ నలుపుకోవటం మొదలుపెట్టింది. కస్తూరి ఆశ్చర్యపోతూ నాతో రహస్యంగా, "ఏ కంట్లో నలకపడ్డదీ ఆవిడకి తెలీటంలేదు. రెండు కళ్ళూ నులుముకుంటున్నది!'' అన్నది.

''శ్!" అన్నాను.


నా సంజ్ఞ తృణీకరించి కస్తూరి, "పాపం కంట్లో నలక పడిందా యేమండీ! మా వారు కంటి నలకలు భలే బాగా తీస్తారు" అని కేకేసింది.

మునసబుగారిభార్య తడిసిన ఎర్రని కళ్ళతో కస్తూరికేసి మింగేటట్టు చూసి తన భర్తతో కీచుగొంతుతో ఏదో సంబంధంలేని సంభాషణ అతిరౌద్రంగా ప్రారంభించింది. ఆ అరుపు తెరలో నేను ఏకాంతంగా కస్తూరితో, "నీవు నా పరువు తీసేస్తావు. ఇట్లా అయితే నిన్నింటికి పంపేస్తాను!" అన్నాను చాతనయి నంత గంభీరంగా.

కస్తూరి చెంపలు వాయించుకుని "ఇంకేమీ చెయ్యను'' అన్నది నమ్మకంగా.

## 5

మేం వాల్తేరులో దిగాం. మే మిద్దరమూ స్టేషన్‌లోనే స్నానంచేసి బట్టలు మార్చేశాం. కస్తూరి ఆకలవుతున్నదన్నది. స్టేషన్‌లోనే భోంచేసి బండి చేసు కుని విశాఖపట్నం వెళ్ళి టర్నరు సత్రంలో బస చేశాం. ఇద్దరమూ ప్రయాణపు




బడలికతో అలిసి పోయినాం. అందుచేత పక్కలు పరిచి కాస్సేపు నడుములు వాల్చాం.

నాకు సాయంకాలం నాలుగింటికి మెళుకు వొచ్చింది. అప్పుడే కస్తూరి లేచి ఎటో వెళ్ళింది. పసిపిల్లలు మారుపడితే పడ్డంత కంగారుపడి నేను ఆమెను వెదకటానికి బయటికొచ్చాను. ఇంకో గదిలో ఎవరితోనో మాట్లాడుతున్న కస్తూరి గొంతు వినిపించి నవ్వొచ్చింది. ఏమిటో కోస్తున్నది—

"కలకత్తాలో నెల్లాళ్ళుండి, ఆ తరువాత గయ వెళతాం!" అంటున్నది. కాస్సేపు ఆలకించాను. నన్ను 'మా వారి' కింద వాడేస్తున్నది. పుస్తె కట్టిన పెళ్లామైనా అంతగర్వంగా చెప్పుకోదు.

ఇంకోరి విషయంలో ఏమోగాని కస్తూరి విషయంలో ఇట్లా చెప్పుకోవటం ఇల్లాయితే బాగుండునన్న అభిలాష మాత్రం కాదు. అవతలి వాళ్ళని మోసం చేసి ఆనందం పొందాలనే ప్రయత్నం మాత్రమే.

కస్తూరి రాగానే, "ఎవరు వాళ్లు?" అని అడిగాను.

"ఎవరో వొట్టి పల్లెటూరి రైతులు. వాళ్ళ వూరు మహాపట్నం అనుకుంటున్నారు. వాళ్ళ ప్రాణాని కిది మెడ్రాసల్లే ఉన్నట్టుంది" అన్నది.

"ఇక్కడికి మద్రాసు అయిదొందల మైళ్లు. ఇక్కడివాళ్ల కిదే మెడ్రాసు."

"అయితే మాత్రం 'పట్టం, పట్టం' అని అదే గొప్ప చెప్పుకోవటమా? ముష్టి గొప్ప!"

"పట్రం మేమిటి?"

"ఏమిటో నా కేం తెలుసూ? ఆవిడ అంటుంది పట్రమని. పట్నమన్న మాట గామాలి!"

"అందర్నీ ఎక్కిరిస్తావు. నీకేం వంక లేదా ఏమిటి?"

"నాకు వంకుందా యెట్టా?"

"నా కాకలి దహించుకు పోతున్నది. టిఫెన్ తెచ్చిపెట్టేవా డెవడన్నా ఉన్నాడేమో చూడు!"

కస్తూరి బయటికి వెళ్ళి, "అప్పలయ్యా!" అని కేక పెట్టింది. ఆ కేకకు ఎవడో వచ్చాడు.

"మళ్ళీ టిఫి నెందుకూ? ఊళ్ళోకి పోగూడదూ? నా కేమన్నా కొంటానన్నారుగాదూ?" అన్నది కస్తూరి.

"అయితే నువ్వెళ్ళి ఒక బండి పట్టుకురా!" అన్నాను ఆ వచ్చినవాడితో.

మే మిద్దరమూ ఆ పెట్టె బండి ఎక్కి బట్టల దుకాణాలకి తీసుకుపొమ్మన్నాం.

"ఇందా కేమయిందనుకున్నారు? ఆవిడ నీ పేరేమిటని అడిగింది. అడిగితే 'కస్తూరి' అన్నాను".

"ఏవిడ? పట్రం అన్నావిడేనా?"

"కాదింకో ఆవిడ. అంతా తెలీని మేళం!" అని కస్తూరి విసుక్కుంది.

"అంటే"

"ఏమిటంటే?"

"నీ పేరు కస్తూరి అంటే?"

"ఆఁ—ఆవిడ సోద్దెంగా 'కస్తూరేమిటి సానోళ్ళ పేరు' అంది."

"ఊఁ".

"అంటే, అది మా యింటి పేరమ్మా! మా వారు నన్ను ఇంటిపేరుతోనే పిలుస్తారు. వెనక ఆయన కస్తూరనే బోగందాన్ని ఉంచుకున్నారుట. ఆ మనిషి మీద ముద్దుకొద్దీ నన్నలా పిలుస్తారు. అసలు నా పేరు కనకదుర్గా మహాకాళి మహా దేవమ్మ అని చెప్పాను. బాగుండ్లా?"

"నమ్మిందా?"

"అంత పిచ్చిముండా ఏమిటి?"

"మరెందు కట్లా అన్నావూ?"

"నమ్మకపోతే నన్నేంచేస్తుందని."

''నీకు మతిలేదు. నిన్నిక్కడ వెర్రానుపత్రిల్లో పరీక్ష చేయించాలి!"

''వాళ్ళకే మతిలేదు."

''ఎవరికి?"

''ఆనుపత్రిల్లో వాళ్ళకు. అందుకనే అది వెర్రానుపత్రి.''

కస్తూరి కావాలని అట్లా మాట్లాడుతున్నదనే ఆలోచన నాకా సంభాషణ రుచించకుండా చేసింది. కాని నే నామెను నిరుత్సాహపరచ దలచుకోలేదు.

"ఈ బండి చూడండి పెట్టెల్లే!"

''దీన్ని పెట్టెబండి అంటారు."

''ఈ రెండు కిటికీలూ మూస్తే?''

''ఏమౌతుంది?"

"లోపల మనం ఏమిటో చేస్తున్నామనుకుంటారు."

కస్తూరికేసి ఒక్కసారి తీక్షణంగా చూసి మరి మాట్లాడలేదు.

బట్టలషాపులో కస్తూరికి రెండు మంచి చీరెలు, వాటికి తగిన బ్లౌజుగుడ్డలూ తీసుకుని అవి కుట్టటానికి అక్కడే ఇచ్చి కాఫీ హోటలుకు వెళ్ళాం.

కాఫీహోటల్లో అందరూ కస్తూరికేసి వింతగా చూశారు. కస్తూరి ఆ హోటల్లో ఉన్నంతసేపూ నోరు విప్పలేదు. నేను బండిలో ఆమెవంక చూసినచూపు కొంచెం పనిచేసింది.

హోటలునించి లైటుహౌసు దగ్గిరికీ అక్కడినించి కాలి నడకనూ హార్బరుకేసి నడిచాం. కొండతొలిచి రైలువేసిన చోటికి రాగానే కస్తూరి చాలా ఆశ్చర్య పడింది. అక్కడినించి బాక్‌వాటరు దాటి అరటితోటలంతా పొద్దూకేదాకా తిరిగాం. ఆ రెండుగంటలసేపూ కస్తూరి తన్ను తాను మరిచిపోయినట్టు కనిపించింది. ఆ సమయంలో ఆ మనిషి అసలు స్వరూపం కొంత బయటపడ్డది. కస్తూరి తన్నాకర్షించిన దానిలో పూర్తిగా మునిగిపోగలదు ఆ సమయంలో నోట మాట లేకుండా కూడా అయిపోగలదు. కస్తూరి తన అయిష్టతలు అందరికీ చెబుతుంది గాని తన ఇష్టా లింకోరికి చెప్పదు. అవి తనకే ఉంచుకుంటుంది.

నేను వద్దంటున్నకొద్దీ అక్కడ కొన్ని పూలు కోసి తల్లో పెట్టుకున్నది కస్తూరి. ఇది ఎవడో చూసి మా మీదికి పోట్లాట కొచ్చాడు. వాడిచేతిలో ఒక బేడ పెట్టి వాడికోపం ఉపశమింపజేశాను.

"ఆ బేడా పెడితే ఇంతకు పదింతలు పూలొచ్చేవి,'' అన్నాను.

"అవీ ఇవీ ఒకటేనా ఏమిటీ? వాళ్ళా వెధవచేతుల్తో కోసినవీ మనం కోసు కొన్నవీ ఒకటేనా?''

"మనమంటావేమిటి? నేను కోశానా ఆ పూలు?''

"మొత్తానికి మీద ఈగవాలనీరే! మీరు కోసి నా తల్లోపెడితే వద్దన్నానా ఏమిటి? అప్పుడు బేడాకాదు – పావలా ఇప్పించేదాన్ని"

"నా చేతనా?"

"ఊఁ?"

ఏడూ ఏడున్నరకల్లా ఊళ్ళోకి వచ్చి భోంచేశాం.

"నాకు నిద్దర్రావడం లేదు. సముద్ర పొడ్డున పోయి కూచుందామా?" అన్నది కస్తూరి.

''ఎనిమిదింటికే నిద్దరొస్తుందా ఏమిటి? ఓ గంటసేపు కూర్చునివద్దాం పద!" అన్నాను.

ఇద్దరమూ సముద్రతీరానికి వెళ్ళాం. అలలకు దగ్గిరగా రాళ్ళమీద కూర్చున్నాం. ఇంతలో చంద్రోదయమయింది.

"ఎంతబాగుంది, అలలమీద వెన్నెల!" అన్నది కస్తూరి.

"ఇంకేం, కవిత్వం రాయి!" అన్నాను.

కస్తూరి విసుక్కుంటూ, "ప్రద్దానికి అంత పెడసరంగా మాట్లాడకండి!" అన్నది.

"నీకు బాగుండదా?"

"ఊఁహూఁ!'' కస్తూరి నవ్వింది, నా సహృదయం అర్థం చేసుకున్నదానల్లే.

కొంచెం సేపుండి, "పిచ్చా!" అన్నాను.

"ఊఁ" అన్నది కస్తూరి, నేనట్లా పిలవటం తన కలనాటయినట్టే.


"ఏమిటాలోచిస్తున్నావు?''

"మా అమ్మ ఏంచేస్తూంటుందో!"

నాకు కస్తూరిని చూస్తే జాలేసింది.

కస్తూరి తనలో తను నవ్వుకుంటూ, "నేను ఊళ్ళోలేనందుక్కూడా మా అమ్మ మాయింటి కొచ్చేవాళ్ళదగ్గిర డబ్బు వసూలు చేస్తూఉంటుంది. అమ్మో, అది తగని గడుసు లంజ!" అన్నది ఆపేక్షగా.

"మీ అమ్మ నిన్ను తిక్కలంజ అన్నది." అన్నాను.




"అంటుంది దాన్నోరుబడ ! నోరిప్పితే దానివన్నీ తప్పుడుకూతలే !" అన్నది కసూరి తల్లిమీది ప్రేమ ఉట్టిపడేటట్టు.

ఆ విద్య పెద్దకులాల వాళ్ళకి ఆటేచాతకాదు. తక్కువ కులాల వాళ్ళకుండే సహజమైన ప్రేమలుకూడా పై కులాలవాళ్ళ కుండవేమో

"మీయింటికి నీకోసం వాల్తీగా ఎంతమంది వస్తూంటారూ ?'' అన్నాను.

"ఇరవైతొమ్మిదిమంది !" అన్నది కస్తూరి రోషంతో.

"నోరు విప్పితే నీనోట నిజం రాదుకద !"

"మరి ఆ అడగటమేంది ? నేనేం పత్తిత్తునన్నానా !'' అన్నది కస్తూరి, నోరు విడిచి బోలెడంత శూద్రయాస రానిస్తూ.

"ఎరగనివాడితో, నాతో నీకు కొత్తగా లేదూ ?''

"మా కులానికి కొత్తేమిటి ?"

"మరి నేనూ నీ ఇతర స్నేహితులూ ఒకటేనా ?"

"ఆడదాంతో ఆపేచ్చగా ఉంటం మీకు చాతకాదు. అంతే తేడా.

"చాతకాదని నీకెట్లా తెలుసూ ?"

"చాతయితే నాతో ప్రేమగా ఉండరేం ?''

"నేను నీకంటె ఎంత అందమైనవాళ్ళని ప్రేమించి ఉంటానంటావు ? నీకన్న ఎంత చదువుకున్నవాళ్ళతో సావాసంచేసి ఉంటాననుకుంటున్నావు ?"

''ఎవరిగొప్ప వాళ్ళదీ!" అన్నది కస్తూరి...

సముద్రం ఒడ్డున పదింటిదాకా కూర్చుని ఇంటికి బయలుదేరాం.

## 6

విశాఖపట్టణంలో మూడురోజులుండి కలకత్తా బయలుదేరాం. దారిపొడుగునా నా మీద కస్తూరి ఏవో మహాస్త్రాలు ప్రయోగిస్తూనే ఉంది. ఆ మహాస్త్రాలకు ఉలికిపడకుండా ఉండటం ఒకటి నేర్చుకున్నాను. అదీకాక ఆ మనిషి మాటల్లోనూ చేతల్లోనూ ఉన్నంత నైచ్యం మనస్సులోనూ, హృదయంలోనూ లేదని కూడా నా కర్థమయింది. పైగా ఆమెలో ఒకవిధమైన అభిమానం లేకపోలేదు. సహృదయంతో ఏమన్నా పడుతుంది గాని నిజానికి ఏ మాత్రం నిందారోపణ చేసినా సహించదు. తననిగాని తన వృత్తినిగాని హేళనచేస్తే సహిస్తుంది, నిందిస్తే సహించదు.

ఆ మనిషి దయకు లొంగిపోతుందని కనిపెట్టాను. కాస్సేపు చనువిస్తే ఆ ఉత్సాహంతో ఒక రోజల్లా అడ్డమైన కోతిపనులూ చేస్తుంది మళ్లా ఒక్కరవ్వ ఎడంగా ఉంచితే గంటలతరబడి-మళ్లీ నాకై నేనే చనువుగా మాట్లాడేదాకా- బిగుసుకుపోయి, వెంట ఎందుకు తెచ్చానా, అనిపించేటట్టు చేస్తుంది.

ఆమెను తీసుకురావడంలో నా అభిప్రాయం ఆ మనిషి గురి సంపాదించి, వీలయితే ఆమెకు ఉన్నతభావాలూ అవీ నేర్పి, ఆమె వృత్తిని, దానివల్ల కలిగిన కుసంస్కారాన్నీ వదలగొట్టి, భావనారాయణకు ఒక చెల్లెల్ని ఇద్దామని.

కాని ఇంతవరకూ నా ప్రయత్నం ఒక అంగుళమైనా ఆచరణలోకి రాలేదు. ఈ మూడురోజులనుంచీ కస్తూరి వ్యక్తిత్వం తెలుసుకోవడంలోనే కాలంగడిచింది గాని, దాన్ని అణుమాత్రం సంస్కరించటం నా చాతకాలేదు. పైగా చూస్తున్న కొద్దీ, ఆమెవృత్తి ఆమెలో కలిగించిన సంస్కారంలో అదోరకం అందం ఉన్నట్టు నాకు క్రమంగా విశ్వాసం కలుగుతుందేమోననే భయంకూడా కలగ సాగుతున్నది. ఆమెను సంస్కరించబోయి నేనే సంస్కారం పొందితే నా ప్రయత్నమంతా వృధా అవుతుంది. నా దృష్టిలో నేనే అపహాస్యం పాలవుతాను.

నేను కస్తూరిలో చెయ్యదలచిన సంస్కారం సాధ్యమైనంత సహజంగా చేతామని నా ఏడుపు; లేక మనిషి ప్రవర్తనను నేను శాసించటం మొదలుపెడితే డబ్బిస్తున్నాను కనక ఆ మనిషి నా అధికారాన్ని పాలించవచ్చు. కాని నాకు కావలసిం దదికాదు. ఆర్థికసమస్య తీరుస్తున్నాను కనక ఆమె ఇప్పుడు నా వాతావరణంలో నాకు నచ్చే సంస్కారాన్ని అప్రయత్నంగా పొందాలి. అదీ సోషలిస్టు

సిద్ధాంతం. నేనావిణ్ణి సంస్కరించటానికి బదులు ఆవిడ నన్ను సంస్కరిస్తే అదికాస్తా తల్లకిందులయి ఊరుకుంటుంది.

అయినా ఒకవేళ నేను తొందరపడుతున్నానేమో ! ఇంకా మూడురోజులైనా గడవలేదు. అప్పుడే ఏం మార్పు కనపడుతుంది !

ఇక - ఒకప్పుడు ఈ కస్తూరిని ప్రేమించటం గురించి నేను కన్న కలలు... ఆ కలలన్నీ ఇప్పుడు నాకు చాలా దూరమైనై. ఈమనిషిని నేను కామించగలను మోహించి అక్కరకూడా గడుపుకోగలను. కాని ఆమెను ప్రేమించటం ఎట్లా ? అసంభవం. నే నెంత విశాల హృదయుణ్ణయినా, ఆమె వృత్తీ, అందువల్ల కలిగిన సంస్కారమూ నా ప్రేమకు అడ్డురాక తప్పదు—నిర్లిప్తుణ్ణిగా ఉండి గమనించటానికి ఆకర్షవంతంగా కనపడ్డప్పటికీ.

రైల్లో ఒకసారి నాకు కొన్ని జావళీలు పాడి వినిపించింది. మొదట్లో మండిపడ్డాను. నాకు కోపం వచ్చినకొద్దీ ఆ మనిషికి మరింత ఉత్సాహం వచ్చింది. ఆ తరువాత ఆమెకు నా సహనశక్తి చూపిద్దామని, ''ఆ వెధవ పాటలు పాడకు, నీకు పుణ్యం వుంటుంది. నా కవంటే అసహ్యం !" అన్నాను మెల్లిగా.

''ఏముందా పాటల్లో ?" అని నాతో వాదనకు వచ్చింది కస్తూరి. ''పట్టూ విడవకురా—పరవశ మౌతున్నదిరా–"

"ఓహో ! ఏమిటేమిటి ? సాంతంగా పాడూ !"

కస్తూరి మొహం చిట్లించి, "అన్నీ లయలు ! మీరు వొద్దంటే మాని పాడమంటే పాడాలేం ?" అన్నది.

"కాదు. నేను వద్దన్నప్పుడు పాడి, పాడమన్నప్పుడు మానెయ్యి ! అట్లా చేస్తే నువ్వు నా కన్న గొప్పదానివని తేలిగ్గా రుజువవుతుంది !" అన్నాను ఎగతాళిగా.

ఆ మాట గుచ్చుకున్నది. కస్తూరికి కోపం వచ్చింది. వెంటనే నాకు కష్టం వేసింది. ఆ మనిషి ఆనందాన్ని క్షణంలో తుంచగలశక్తి నాలో ఎంత వుందో నాకు తెలిసివచ్చింది. ఆ మనిషి నా జాతినెట్లా క్షమిస్తుంది ? భావనారాయణ ఆహ్వానాన్ని తోసివెయ్యటంలో కస్తూరి ఎంత తెలివితేటలు —చదువుకుంటే వచ్చేవి కాదు, ఆ జాతికి ప్రకృతి ఇచ్చినవి—ప్రకటించిందోనా కర్థమయింది.

కస్తూరిని లాలింతామా అనుకున్నాను. కాని ఆమెను కొంత బాధపడనిచ్చినట్టయితే ఆమెక్కూడా మంచిదేమో ననిపించింది. ఆమె నిగ్రహం ఎరగదు. ఒక విధంగా ఆమె దగ్గరికి వెళ్లినవాళ్ళంతా ఆమెను పాడుచేశారు. నిగ్రహం

లేకపోవటమే వారి కామెలో నచ్చింది. దాన్నే ప్రోత్సహించారు. ఒక్కరవ్వ నిగ్రహం నేర్చుకున్నందువల్ల ఇంతలోకి కస్తూరి మరేమీ చెడదు. ఒకవేళ అది చెడడమే అయితే ఆమెను చెడగొట్టకుండా భావనారాయణ చెల్లెలుగా ఎట్లా చేస్తానూ ? ఆ పని చెయ్యగలిగితే ఆమెను చెడగొట్టటానికి నా కభ్యంతరంలేదు. ఈ స్వేచ్ఛా విహంగంపై చూపుల కింపుగా ఉందేగాని ఆమె వల్ల ఇతరసాంఘిక ప్రయోజనంలేదు. తాత్కాలికానందం తప్ప.

కాస్సేపుండి "కనకదుర్గా మహంకాళి మహమ్మారీ !" అన్నాను.

"మీ రట్లా కొంతసేపు కోప్పడి, కొంతసేపు నవ్విస్తే నే నేడుస్తాను కోప్పడితే కోప్పడండి. నవ్విస్తే నవ్వించండి !" అన్నది కస్తూరి ఖచ్చితంగా.

"కాస్సేపేడు ! చూద్దాం !"

కస్తూరి మాటమార్చి "ఈ దరిద్రపు రైలింకా ఎంతకూ కలకత్తా పోదేం !" అన్నది.

"ప్రయాణం విసుగ్గా ఉందా ?"

"నాకు నిద్రపోదామనిపిస్తున్నది."

"పడుకో !"


కస్తూరి నడుం వాల్చింది. "చిచ్చికొడితే దబ్బున నిద్రపోతాను !" అన్నది.

నేను మారుమాట్లాడకుండా ఆమె తలవేపున కూర్చుని ఆమెను చిచ్చికొట్ట సాగాను. కస్తూరి స్వతంత్రంగా ఇంకొంచెం పైకి జరిగి, తల నా తొడమీదపెట్టి సర్దుకుని పడుకుని కళ్ళు మూసుకుంది.

మరో నిమిషంలో నిజంగానే కస్తూరికి నిద్రపట్టింది. వెంటనే నేను చిచ్చి కొట్టడం మానేశాను. కానీ నా తొడమీదినుంచి ఆమె తల తీసెయ్యటానికి మన సొప్పలేదు.

ఆ క్షణాన నన్ను గురించి నా కింకో కొత్తవిషయం అర్థమయింది. నాకు నిద్రపొయ్యే ఆడదాన్ని చూస్తే ఉద్రేకం రాదు. కస్తూరిని ముద్దుపెట్టుకోవాలనే కోరికా, స్పృశించాలనే కోరికా నాలో గోప్యంగా ఒకవేళ ఉండివుంటే—లేదని నే ననను— అది పైకి రావటానికి అది మంచితరుణం. కాని నాలో అటువంటి కోరిక పుట్టుకరాలేదు. పైగా ఆమెకు నిజంగా నిద్రపట్టిందని తెలియగానే ఆమె వంటిమీద చెయ్యి వెయ్యలేకపోయినాను.

కాని కస్తూరి అయిదు నిమిషాలన్నా నిద్రపోలేదు. పక్కకు ఒత్తిగిలి పడుకున్న మనిషి వెల్లికిలా తిరగటంలో కళ్లు తెరిచి నా కేసి చూసి చప్పునలేచి




కూర్చుని, "తొడ నెప్పిపుట్టలేదుకద!" అన్నది. లేదన్నాను. పక్కన పెట్టిన దిండు తీసి తలకింద పెట్టుకుని, అందుకుగాను కొంచెం కిందికి జరిగి, లాంఛనంగా చెయ్యి తలమీదిగా నా మీద వేసి మళ్లీ నిద్దరకు పడ్డది.

ఆ రాత్రి నాకు త్వరగానే నిద్రవచ్చింది. కస్తూరి నా తల దగ్గిర వచ్చి కూర్చుని బయటికి చూస్తూ, "వెన్నెల్లో చెట్లు పరుగెత్తుతున్నై" అన్నది,

"మంచిపని చేస్తున్నయ్. పడుకుని నిద్రపోరాదూ?"

"నాకు నిద్రపోబుద్ధి పుట్టటంలేదు."

"మరేం చెయ్యబుద్ధి పుడుతున్నది."

"రైల్లోంచి దూకి చెట్లవెంట పరుగెత్తబుద్ధి పుడుతున్నది!"

"నీతో మాట్లాడితే నా మతికూడా పోతుంది. నాకు నిద్దరొస్తున్నది."

"అవును. పాపం, పడుకోండి. నేను పలకరించను!" అన్నది కస్తూరి చాలా దయగా.

సరిగా నిద్రపట్టబొయ్యే సమయానికి నా నుదుటికి కస్తూరి చెంప తగిలినట్టయి ఉలికిపడి "కస్తూరీ!" అన్నాను. కస్తూరి చెంప నా నుదుటికి ఎడంగా వెళ్లిపోయింది.

"ఏమిటి చేస్తున్నావు - మాట్లాడవేం?"

"మీరు నిద్దరపోయినా రనుకున్నాను" అని చిన్నగొంతుతో సమాధానం వినిపించింది.

"ఏమిటా దొంగ వేషాలు ?"

"మీతోడు ! మీరు నిద్దరపోతున్నారనుకున్నాను ! ఈ తప్పు క్షమించండి ! ఇక ఎప్పుడూ చెయ్యను." అన్నది కస్తూరి గంభీరంగా.

నాకు సంతోషం వేసింది. కస్తూరిచేత గంభీరంగా మాట్లాడించ గలిగాను, ఎట్లాఅయితే ఏం !

## 7

మేము కలకత్తాలో అడుగుపెట్టిన క్షణంనించీ కస్తూరికి కొత్తచోటికి వచ్చామనే జ్ఞానం కలగటం మొదలుపెట్టింది. తను రోడ్డుమీద కనిపించిన ప్రతి మనిషినీ పలకరించటానికి లేదు. అంతా కొత్తే—కొత్తరకం మనుష్యులూ, భాషా, వాహనాలూ, ఇళ్లూ, ఈ కొత్తరకమంతా కస్తూరి కొకవంక కొత్త అనుభవం ఇచ్చినప్పటికీ మరోవంక ఆమె పాత ఉత్సాహాన్ని చంపేసింది.

ఒకరోజల్లా కస్తూరి దేన్ని చూసీ నవ్వలేదు, ఎవరినీ హేళనచెయ్యలేదు. కాని మర్నాటినించీ ఆమె కింకోవిషయం తెలిసివచ్చింది—తను తెలుగులో ఏం మాట్లాడినా ఎవరికీ అర్థంకాదనీ ఎవరూ కనుక్కోలేరని...

స్టేషనునించి టాక్సీ చేసుకొని మేం మహాలక్ష్మీభవనానికి వెళ్ళాం. స్నానాలు చేసి భోంచేసి కాస్సేపు నడుములువాల్చి, మళ్లీ టాక్సీ చేసుకుని ఊరిమీదపడ్డాం.

ఆరోజు తిరిగిన తిరుగుడంతా వృధా. టాక్సీవాడు మమ్మల్ని అధమం యాభైమైళ్ళన్నా తిప్పి ఉంటాడు. మేం చూసిందల్లా మంచి మంచి మేడలూ, పెద్ద పెద్ద రోడ్లూ, ఒక పెద్ద మైదానమూ, షాపులూనూ.

కస్తూరికి తిరగటం దబ్బునే మొహం మొత్తింది. ఇంటికి పోదామన్నది.

"అప్పుడే ఇంటికివెళ్ళి ఏం చేస్తాం? ఏదైనా సినిమాచూసి పోదాం!" అన్నాను.

"ఏం సినిమాలు, దిక్కుమాలిన సినిమాలు ! రోజూ చూసేవేగా ?" అన్నది కస్తూరి డాబుగా.

ఇంగ్లీషు సినిమా అయితే కస్తూరి కడివిగోడుగా ఉంటుందని, హిందీ పిక్చర్లు చూపించే సినిమాకు తీసుకుపొమ్మన్నాను టాక్సీవాణ్ణి. తీరా అక్కడిదాకా వెళ్లితే అదేదో కని విని ఎరగని పిక్చరు. ఆ దిక్కుమాలిన పోస్టర్లు చూస్తేనే, నాకు రోత పుట్టింది. దాన్నిండా ముసుగురౌతులే !

ఏమొచ్చామో వచ్చాం. మళ్లా వెనక్కుపోవట మెందుకని టిక్కెట్టుకొని టాక్సీవాణ్ణి వదిలించుకుని హాలు ప్రవేశించాం !

ఆ సినిమా హాలుకూడా కస్తూరికి నచ్చలేదు. "ఇంత పెద్ద బస్తీకదా, ఇదేనా సినిమాహాలు ?" అన్నది.

ఆట మొదలుపెట్టగానే కస్తూరి ఉత్సాహమంతా తిరిగివచ్చింది. అది అచ్చగా కస్తూరికోసం తీసినపిక్చరయినా అంతకన్న ఎక్కువ ఆనందించి వుండదు.

సినిమా పూర్తికాగానే మళ్లా హోటలుకు వచ్చిపడి భోంచేశాం.

"ఈ వెధవతిండి నాకు బాగోలా ! ఇదంతా పప్పుబ్యామ్మర్ల తిండి !" అన్నది కస్తూరి.

"మీ తండ్రి పప్పుబ్యామ్మ డేనేమో !" అన్నాను. కస్తూరి మాట్లాడలేదు. "తండ్రు లెవరో వాళ్ళతాలూకు బంధువులెవరో తెలియకపోవటం మీ కులాలకి చాలాహాయి. మాకున్న కష్టాలు మూడువంతులు చుట్టాలవల్లనే రావటం. మాకు అమ్మవేపుచుట్టాలూ, నాన్నవేపు చుట్టాలూ కూడా ఉంటారు. మీ కొక్క అమ్మ వేపువాళ్ళే ఉంటారు. వాళ్ళు కూడా వాళ్ళగొడవలో వాళ్ళుంటారుగాని మిమ్మల్ని అదే బాధించరు. అందువల్ల మాకన్న మీరు చాలా హాయిగా ఉంటారు. అదీకాక మీజీవితాలకు ఆపేక్షలొకటి ఉండవు. మాకు సగం తద్దినం ఆపేక్షలే. ఆ ఆపేక్షలకోసం మేం చాలా కష్టాలు పడతాం. మొగుడి ఆపేక్షకోసం పెళ్ళామూ, తల్లిదండ్రుల ఆపేక్షకోసం పిల్లలూ, చుట్టాల ఆపేక్షకోసం వాళ్ళచుట్టాలూ నానా యాతనా పడతారు. ఈ ఆపేక్షలవల్ల కానీ గిట్టుబాటుండదు. మీకులంవాళ్ళు అయిదు నిమిషాలు ఆపేక్షచూపిస్తే రెండు రూపాయలు చేతిలో పడతై. మీరు డబ్బివ్వనివాళ్ళను ఎంత నిర్లక్ష్యంగా చూడవచ్చు ! ఎంతహాయి !'' అన్నాను.

"ఔనౌను, మేం మనుషులం కాం !" అన్నది కస్తూరి.

నేను పడుకోటానికి ఉపక్రమిస్తూ, "నాకు నిద్దరొస్తున్నది. నువ్వు పడుకునేటప్పుడు దీపం ఆర్పేసి పడుకో !" అన్నాను.

కస్తూరి వెంటనే పక్కమీదినుంచి లేచివెళ్ళి దీపం ఆర్పేసి వెళ్ళి పడుకున్నది.

నాకు నిజంగా నిద్దరపట్టలేదు. మరో పదిరోజులదాకా కస్తూరినిగురించి ఆలోచించ నవసరం లేదనుకున్నాను. కాని ఇంకే ఆలోచనా లేనప్పుడల్లా ఈ ఆలోచనే వచ్చేది. ఆ మనిషి ప్రకృతి నల్లరాయివంటిది. చప్పున వాతావరణంతో మారేదికాదు. అట్లామారితే వాళ్ళకి జరగదేమో ! నిజానికి వాళ్ల జీవితాలలో యుద్ధం జాస్తి. మనిషి రాటుతేలిఉండాలి. ఈవిధంగా నావెంట ఎంతకాలం

తిప్పితే కస్తూరి సంసారస్త్రీ అవుతుంది ? ఎంత తిరిగినా మళ్ళా ఇంటికిపోయిన అయిదు నిమిషాల్లో మామూలు కస్తూరి అయిపోదా అని నా సందేహం.

నేను కస్తూరిని మార్చటానికి సరిఅయిన ప్రయత్నం చేస్తున్నానా అన్న సందేహంకూడా నన్ను బాధించసాగింది. ఆ మనిషిచేత పుస్తకాలు చదివిస్తే ? ప్రేమమీదా నీతిమీదా అభిమానం పుట్టిస్తే ? ఇదంతా నావల్ల ఎట్లా సాధ్యమవుతుంది ? ఇన్నాళ్లుగా ప్రేమ అనే ఎంతో డబ్బుకోసం గాలంవేసిన మనిషి, ప్రేమే పరమార్థమని ఇవాళ నమ్మగల్గుతుందా ? నా కేమీ తోచలేదు. నేను ఓడిపోతే జరిగే ప్రమాద మేమీలేదు. మే మిద్దరమూ ఎవరిదారిన వారు పోతాం. కాని ఓడిపోవటం నాకిష్టం లేదు.

కస్తూరి మంచంమీద కదలిన చప్పుడయింది. మరో క్షణంలో కస్తూరి నా మంచందగ్గిరికి వచ్చి చేత్తో నన్ను తట్టుతూ, ''అప్పుడే నిద్దరా ?'' అన్నది.

"ఏం కావాలి ?''

''కొంచెం చోటివ్వండి !"

"దేనికి ?"

"పడుకుంటాను."

"నీ మంచంమీద పడుకోరాదూ ?"

"ఆ మంచం నాకు బాగుళ్ళా !"


"అయితే నువు దీనిమీద పడుకో - నేను దానిమీద పడుకుంటాను !" అని లేచాను. కస్తూరి పక్కన కూచుని, ''నాకు ఒంటరిగా పడుకుంటే నిద్రరావటం లేదు. ఇంత మంచండుంది. ఇద్దరం పడుకోలేమా ?" అన్నది.

"నీబుద్ధులు నాకు నచ్చటంలేదు. ఇటువంటి వేషాలువేస్తే నేను నీకు దమ్మిడీ కూడా ఇవ్వను ' అన్నాను.

ఒక్క క్షణం ఊరుకుని, "ఇవ్వకండి, నన్ను మాత్రం మీదగ్గర పడుకోనివ్వండి, ఒక్క రాత్రివేళ నేను మిమ్మల్ని పీక్కుతినన్లే ! అసలు నాకు ఒంటరిగా పడుకోటం అలవాటు లేదు. ఎవరూ లేకపోతే మా అమ్మ పక్కలో పడుకుంటాను !'' అన్నది కస్తూరి.

"ఏం నాజూకు !''

కస్తూరి మాటలతో కాలం వ్యర్థంచేయక నా పక్కమీద నడుం వాల్చి, ''మీరు కూడాపడుకోండి !" అన్నది నేను విధిలేక పడుకున్నాను. కస్తూరి నన్ను పొదివి



పడుకుని "ఇంక మాట్టాణ్ణు! మాట్టాడితే ఒట్టే!" అన్నది. నేను కస్తూరికి వీపు పెట్టి ఒత్తిగిలి పడుకున్నాను. కస్తూరి అభ్యంతరం చెప్పలేదు.

నన్ను వలలో వేసుకోవటం కస్తూరి ఉద్దేశం కాదేమో! ఎందుచేతనంటే, నన్ను జయించటాని కామె ఏ మాత్రం ప్రయత్నించినా నేను గల్లింతా కొట్టివుందును. కాని కస్తూరి అటువంటి ప్రయత్నమే చెయ్యలేదు. ఒక్క వెకిలిచేష్టకూడా చెయ్యని కస్తూరిలో ఏదో శుచిత్వం ఉందనుకుని సంతోషించాను.

కాని నేను పడిన బాధ వర్ణనాతీతం. ఆమె రొమ్ములు నా నీపు నానుకున్నై. ఆమె తొడలు నా కాళ్ళకు తగులుతున్నై. ఆమె చెయ్యి నా నడుముమీదే ఉంది. ఒక్కసారి నేను ఆమె వేపు పొర్లితే నా శరీరం నేను చెప్పినట్టు వినదు.

కస్తూరి నిజంగానే నిద్రపోతున్నది. ఇంద్రియాలను ఆమె ఎట్లా జయించింది?

శరీరకాంక్ష కంటే బలవత్తరమైనది దురభిమానం. కనీసం నా కంతే. నాలో రేగే కామాన్ని నేను కస్తూరిద్వారా తీర్చుకుంటే అభ్యంతరం పెట్టదు. కాని ఇంత

కాలం ఆమె దగ్గిర శుకమహాముని మాదిరిగా నటించి ఇప్పుడు నేనూ అందరి వంటి మనిషినేనని ఆమె కెట్లా తెలియనివ్వను ? ఇక కస్తూరి నన్ను మనిషల్లే చూస్తుందా ?

కస్తూరి గాఢనిద్రలో ఉందని తోచగానే మెల్లిగా ఆమెచెయ్యి తప్పించి పక్కలోనించి లేచి రెండో పక్క మీద పడుకుని కస్తూరి వీపుకేసి చూడసాగాను.

"నువు పట్టి చవటవు ! చేతికి దొరికిన సౌందర్యం అనుభవించలేవు. అందు బాటులో ఉన్న పరిమళాలు ఆఘ్రాణించలేవు. ఏమిటి నీ జీవితాశయం ?'' అన్నది నా పాపిష్టి మనస్సు.

"నువ్వు చలంగారి రచనలు బాగా చదివి ఉండొచ్చుగాని, నాకు ఉడకని అన్నం మెతుకులు తినటం అంటే ఇష్టం లేదు. అందరిమల్లే నాకూ ప్రేమ కావాలి. కాని పక్వానికి రాని ప్రేమను తొందరపడి కొరకను. ప్రేమ పిందెలు వంద కొరికి ఆఖరుకు పాపం చేశానని పశ్చాత్తాపపడేకంటే పక్వానికి వచ్చిన ప్రేమ ఒకటి చాలు. దానికోసం వార్ధక్యం వచ్చేదాకా ఆగమన్నా ఆగుతాను. అంత ఆయుర్దాయం భగవంతు డివ్వకపోతే దానికోసం నిరీక్షిస్తూ చస్తాను. సరేనా ? కాలం మించిపోతున్నదనే దిగులు నాకు లేదు. ఈ కస్తూరిమీద నా కింకా ఎక్కువ ఆశలు లేకపోతే నే నీ క్షణం వెళ్ళి ఆవిడ శరీరాన్ని స్వాధీనపరుచుకో గలను. కాని నాకింకా పెద్ద ఆశలున్నై. అవి భ్రమగా పరిణమించవచ్చు. కాని అది భ్రమగా పరిణమిస్తుందనే నిరాశతో ఇప్పుడీపని చేసి, పరిణామం అసలు లేకుండా చేసుకోను'' అని నా అంతరాత్మకు బుద్ధి చెప్పాను.

నా కెప్పుడు నిద్ర పట్టిందో తెలియదు.

## 8

మర్నాడు శివస్వామి దాపరించాడు మాకు. ఉదయమే లేచి నేను దొడ్డికివెళ్ళి మొహం కడుక్కుని మళ్లా గదిలోకి వచ్చేటప్పటికి కస్తూరి వాడితో మాట్లాడు తూంది. వాడు గది నట్టనడాన, మా యిద్దరి పక్కల మధ్యా కుర్చీలో కూర్చు న్నాడు. కస్తూరి తనమంచంమీద ఒయ్యారంగా వుత్తరం రాసే శకుంతల పోజులో పడుకుని మాట్లాడుతున్నది. శివస్వామి నేరుగా కస్తూరిని చూడకుండా మధ్యమధ్య దిక్కులు చూస్తూ మాట్లాడుతున్నాడు. అతను నాకన్నా క్షీణంగా నాలుగయిదు సంవత్సరాలు చిన్న అయివుంటాడు. చూడటానికి ఏ నెల్లూరువాడో అనిపించేటట్టున్నాడు. భాష ఇంకా దక్షిణాదిదిగా వుంది.

అతను నన్ను చూడగానే లేచి, "ఆ యమ్మను చూసి తెలుగువారిగా భావించి వస్తినీ. విచారిస్తే తెలుగువారేనని తెలిసయింది. మనవారు కనిపించితే నాకు నిండా ఆనందం. ఏమో క్షేమసమాచారం వివరిస్తా మని వస్తిని. ఇంక పోయి వస్తునా ?'' అన్నాడు నాతోనూ, కస్తూరితోనూకూడా మాట్లాడుతూ.

"ఏమండీ, ఈయన కేమీ పన్లేదుట. మనకు కలకత్తా అంతా చూపిస్తా నంటున్నాడు. ఇవాళ మన వెంట తిప్పుదామా ?" అన్నది కస్తూరి. శివస్వామి గుమ్మందాకా వెళ్ళినవాడు ఆగి నా సమాధానంకోసం కాబోలు చెవులు రిక్కించాడు.

"నీ కొక్కతెకే చూపిస్తా నన్నాడా ? నా క్కూడానా ?" అన్నాను అకస్మాత్తుగా రైల్లో మాకు తగిలిన మునసబుగారి భార్య జ్ఞాపకం వచ్చింది నాకు.

కస్తూరి నా వంక కోపంగా చూసింది.

నేను శివస్వామికేసి తిరిగి, ''ఇవాళ కాదులే, ఇవాళ నాకు బజారుకు పోయి కొన్ని వస్తువులు కొనాలిసిన పనివుంది. రేపు చూద్దాం !'' అన్నాను.

శివస్వామి వెళ్ళిపోయినతరవాత నేను కస్తూరికేసి తిరిగి ''అడ్డమైనవాళ్ళను గదిలోకి రానిస్తావా ? ఇటువంటి బస్తీలో ఎంత దొంగలుంటారో నీకేం తెలుసు ?" అన్నాను.

''శివస్వామి చాలా మంచివాడు. అతనికి మనిషిని మనిషల్లే చూడటం చాతనవును !" అని కస్తూరి నన్ను దెప్పింది.

"అతనే లోపలికి వచ్చాడా ? నువ్వతన్ని లోపలికి పిలిచావా ?" అన్నాను. పూర్తిగా అసూయతో కాకపోయినా, అసూయపడ్డట్టు కస్తూరికి కనిపించాలని కొంత ప్రయత్నిస్తూ.

"ఏమో నాకు జ్ఞాపకం లేదు. నేనే పిలిచాను కామాలు ?" అన్నది కస్తూరి నిర్లక్ష్యంగా.

"కాఫీ తెప్పిస్తాను. ఈలోపల నువ్వు మొహం కడుగు !"

"ఇంకో గంటదాకా నేను కాఫీ తాగను. మీరు తెప్పించుకోండి."

కస్తూరిని ఆదే సాగదియ్యటం ఇష్టంలేక, నా ఒక్కడికోసం టిఫిను పైకి తెప్పించటం దేనికని నేనే కిందికి వెళ్లాను.

నేను రెండిడ్డెన్లు తిని కాఫీ తాగి మళ్ళా పైకి వచ్చేటప్పటికి మా గదిలోంచి శివస్వామి బయటికి వస్తున్నాడు. నాకు మండిపోయింది. ఈసారి నాకు నిజంగానే అసూయ కలిగింది. శివస్వామి నన్ను చూసి తత్తరపోయినాడు. నే నతన్ని

పలకరించకుండానే లోపలికి వెళ్ళాను. కస్తూరిమాత్రం నన్ను చూసి చిత్తర పోలేదు.

"ఏదో మంచి సంభాషణ భగ్నం చేసినట్టున్నానే!" అన్నాను, నేను భగ్నం చెయ్యకపూర్వమే సంభాషణ అయిపోయిఉండాలన్న విషయంకూడా మరిచిపోయి.

కస్తూరి నాకు సమాధానంకూడా ఇవ్వదలచలేదు.

"నేను బజారుకు వెళ్ళబోతున్నాను. మళ్ళా పదింటిదాకా రాను. నువు నావెంట రావుగా?"

"రాను. నాకు తలనొప్పిగా వుంది."

"నాకు తెలుసు... మిగిలిన వస్తువులు భద్రంగా చూస్తూ ఉండు, నేను వచ్చేదాకా" అన్నాను.


"ఏ మిగిలిన వస్తువులు?" అన్నది కస్తూరి అనుమానంతో మొహం చిట్లిస్తూ.

"నువుతప్ప మిగిలినవి."

నేను బయటికి వచ్చేశాను. నాకు గమ్యస్థానం లేదు. కొంతదూరం తల వంచుకొని ఎటో నడిచాను. నన్ను తలుచుకుంటే నాకే అసహ్యం వేసింది. అదివరకు కొన్ని వేలమందిని చూసిన మనిషి ఒక్క శివస్వామితో మాట్లాడి నందుకు నా కసూయ దేనికి? పైగా ఆ మనిషి నా పక్కలో వచ్చి పడుకున్నా నేను కోరని మనిషి అయినప్పుడు!

కాని నామీద నాకు కలిగిన అసహ్యం కస్తూరిమీద అసహ్యాన్ని తగ్గించలేదు. తను భోగంమనిషికదా? తనకు పురుషుడిమీది వాంఛ అనేది ఎన్నడో చచ్చి ఉండొచ్చుకదా? తన కా శివస్వామి దేనికి? భోగంవృత్తి ఆర్థికసమస్యవల్ల ఏర్పడింది కాదేమో! ఒక్కొక్క ఆడది ఎంత ఆర్థిక చిక్కుల్లో ఉన్నా భోగం వృత్తికి దిగదేమో! పదిమందితో పోతేగాని తృప్తిలేనివాళ్ళే ఈ వృత్తిలో దిగుతారేమో! ఒకవేళ ఈ విధంగా వారు డబ్బు సంపాదించలేకపోతే వాళ్ళు తమ శరీరాలను ఊరికే అయినా ఇస్తారేమోగాని, బెట్టుగా ఉండలేరేమో. కస్తూరి ఆ రకం మనిషే అయిఉండాలి. లేకపోతే కిందటిరాత్రి నా పక్కలో వచ్చి ఎందుకు పడుకుంటుంది? నే నెంత పిచ్చివాణ్ణి! ఆమె ఇంద్రియాలను జయించిందని మెచ్చుకున్నాను.

హరిజన్ స్ట్రీటులోకి వచ్చాను. నాకోసం ఎవరో పంపినట్టు ట్రామొకటి వచ్చి నా సమీపంలో ఆగింది. మరో ఆలోచన లేకుండా అందులో ఎక్కాను.




నేను మళ్ళీ హోటలుకు చేరుకునేటప్పటికి పదకొండు దాటింది. మా గది తలుపు లోపల గడియవేసి ఉంది. నాకు తలుపు తట్టటానిక్కూడా సంకోచమయింది. మెల్లిగా నెట్టి చూసినమీదట లోపల గడియవేసి ఉన్నట్టు తెలిసింది. ఏం చేదామా అని ఆలోచిస్తుండగా లోపల గడియతీసిన చప్పుడయింది. నా గుండె గుభేలుమన్నది, ఎవరు బయటికి వస్తారో అని. కాని ఎంతకూ ఎవరూ రాలేదు. అసలు తలుపైనా తెరుచుకోలేదు.

నేను మెల్లిగా నెట్టితే తలుపు తెరుచుకున్నది. లోపల కస్తూరి ఒకతే ఉన్నది. తన మంచంమీద గోడవేపు తిరిగి పడుకుని ఉంది.

"భోంచేశావా ?" అన్నాను.

కస్తూరి వెల్లికిలా తిరిగి, "ఉఁహూఁ !" అన్నది.

"పొద్దున కాఫీ తెప్పించుకున్నావా ?"

"లేదు".

"ఆకలి కావటంలా ?"

"పొద్దున్న మీరన్నమాటలకే కడుపు నిండింది."

"పొద్దున నువు చేసినపనికి కడుపు దహించుకుపోతున్నది. తిండి తెప్పించనా, పోయి తిందామా ?"

"మీ యిష్టం ! నేను తిన్ను !" మళ్ళీ గోడవేపు పొర్లింది కస్తూరి.

నేను గదితలుపు గడియవేసి వచ్చి కస్తూరి మంచంమీద కూచుని, "చూడు,

కస్తూరీ, నువ్వు నామీద అలిగి లాభంలేదు; ఒకవేళ నేను నీకు కోపం తెప్పించి వుంటే నన్ను బాధించటానికి నువ్వేంచేసినా చెయ్యవచ్చును. నేను నీ మొగుణ్ణి కాను. నాకు నీమీద ఎటువంటి అధికారమూలేదు,'' అన్నాను.

కస్తూరి లేచి కూర్చుని, "నామీద అధికారం చెయ్యొద్దన్నానా? మీరు నన్ను ఏం చెయ్యొద్దన్నా, ఏమనొద్దన్నా చచ్చినట్టు విని తీరతానే! నన్నెందు కిట్లా క్రూరంగాచూస్తారు? మీకు నేనేం ద్రోహం చేశాను? కాస్సేపు నాకు చను విచ్చటం దేనికి? ఆమీద నాకు ఒళ్ళు తెలీకపోవటం దేనికి? ఆఖర్న మాటలతో నన్ను రంపంకోత కొయ్యటం దేనికి? మీ వెంట రావటానికి నేను తగను నాకా సంగతి తెలీదా?... నన్ను పంపెయ్యండి. ఇవాళే నేను మావూరు పోతాను," అని కంట తడిపెట్టసాగింది.

"నేను నిన్ను హింసిస్తున్నానా? మీ వృత్తిలో మిమ్మల్ని మగవాళ్ళెంతో హింసిస్తా రనుకున్నానే!"

"ఏడిచారు! మాదగ్గరి కొచ్చేవాళ్ళు మే మాడించినట్టాడుతారు. వాళ్ళను చూసినట్టు మిమ్మల్ని చూస్తే మీరెప్పుడో నన్ను పాతేసి ఉందురు!"

నన్ను మభ్యపెట్టటాని కామాట అన్నదా?

"అయితే నావెంట ఉండలేవన్నమాటా?"

"వద్దు. నన్ను పంపెయ్యండి!"

"నెలకు రెండువంద లిస్తాను ఉంటావా?"

కస్తూరి తాచల్లే లేచింది.

"ఎవడిక్కావాలండీ వెధవ డబ్బు! ఇవాళే మా ఇంటికి వచ్చి మీరిచ్చిన వందా పుచ్చుకోండి!-"

కస్తూరి ఇంకా ఏమనదలచిందో, ఎంత కష్టపడి నిగ్రహించుకున్నదో నాకు తెలీదు. నేను కాస్సేపటిదాకా నోరు తెరవలేకపోయినాను. ఆ తరవాతకూడా నే ననదలిచింది అనలేక, "ఇక మనం భోంచేదాం. నువు తిండి తింటే నీ కోపం పొయ్యే విషయం ఒకటి చెబుతాను!" అన్నాను.

"నా కొద్దు"

"నా ఆజ్ఞ... నన్నాజ్ఞాపించమన్నావుగాదూ?"

కస్తూరి మారు మాటాడకుండా లేచింది. ఇద్దరమూ భోంచేసి వచ్చాం. కస్తూరి దాదా పేమీ ముట్టుకోలేదు.

"అట్లా కూర్చో చెబుతాను... నిన్ను నావెంట తీసుకురావటంలో నా ఉద్దేశం నీకు నా చాతనయిన సహాయం చేద్దామనీ, నీకు కొంత ఆనందం కలిగింతామనీ. దాని క్కారణం ఉంది. నీ తండ్రి ఎవరో నాకు తెలుసు. నీ అన్నను నేను స్వయంగా ఎరుగుదును. అతనికి నీమీద ఎంత ప్రేమ ఉందో నీకు తెలియదు. అది నీ తప్పు కాదేమో! నువ్వట్లా పెరిగావు. నీ వృత్తి అటువంటిది నిన్ను ఈ గాట్లోనుంచి ఎత్తి ఇంకో గాట్లో వేదామని నా ప్రయత్నం. అది కొనసాగుతుం దని నే నెన్నడూ గట్టిగా నమ్మలేదనుకో. నీలో మారేశక్తి ఉంటే అయిదారు నెల్ల కాలంలో మారతావనుకున్నాను.

"కాని నీకు మారటం చాతనయినా మారటం ఇష్టంలేదని రూఢి అయింది. అది ఇష్టంలేకనే నువ్వింటికి పోతానంటున్నావు. నీ యిష్టం. నేను ఓడిపోయి నాను. మీ అన్న భావనారాయణకా కాస్త ఉపకారమూ చెయ్యలేకపోయినాను.

"ఒక్కమాట చెప్పాలి. నిన్ను వెంట తెచ్చినందుకు నేను మాత్రం ఆనం దించాను. నా కేమీ పశ్చాత్తాపం లేదు".

ఉన్నట్టుండి కస్తూరి, "మిమ్మల్నెవత్తో బాగా మోసగించి ఉండాలి" అన్నది.

ఆ మాట నన్ను తేలు కుట్టినట్టు కుట్టింది.

"ఏం?" అన్నాను.

"పిల్లి ఎలుకతో చెలగాటం ఆడినట్టు ఆడారు నాతో. అది మీ కానందంగా ఉందేం?"

నేను మాట్లాడలేదు.

"ఆయన నాకేం అన్న? ఆయన మా యింట్లో వచ్చి పదిరోజు లుంటాడా? నేను తినే తిండి తింటాడా? నన్ను వచ్చి తన దగ్గిర ఉండమంటాడు. నా కేం తక్కువయిందని ఆయన దగ్గిరుండాలి? ఉంటేమాత్రం ఆయన గౌరవం కాపాడ్డం నాచేత ఏమవుతుందీ? నేను ఉక్కిరి బిక్కిరి అయిపోనూ? నాకెందు కంత బాధ? ఏమి టాయనకు నామీద అపేక్షా? ఆయన ఆనందం ఆయన చూచుకుంటే, నా ఆనందం నేను చూచుకోరాదేం?" అన్నది కస్తూరి.

తన మనస్సు తన కంత స్పష్టంగా తెలిసినందుకు కస్తూరిని మెచ్చుకున్నాను.

"ఇవాళ సాయంకాలం శివస్వామిని మన వెంట రమ్మను. ఊరంతా చూసి వద్దాం. రేపు ఇద్దరమూ బయలుదేరి కొంప చేరుకుందాం."

రాజా మల్లిక్ భవనమూ, న్యూమార్కెట్టూ, ఎస్ప్లనేడ్ బొటానికల్ గార్డెన్సూ తిరిగి మేం హోటలు చేరుకునేటప్పటికి రాత్రి ఎనిమిదిన్నర అయింది.

వెంటనే వేడినీళ్ళ స్నానంచేసి, భోంచేసి నేను నిద్రపోవటానికి సిద్ధమైనాను.

"మధ్యాహ్నం తిండి సయించలేదు. ఈ పూట ఆకలి చంపేసి ఎక్కువెక్కువగా తిన్నాను......మీకు సిగరెట్టు అభ్యాసంలేదా?" అన్నది కస్తూరి.

"కాలుస్తాను కాని అభ్యాసం లేదు. పైగా ఇప్పుడు నాకు నిద్దరొస్తున్నది" అన్నాను.

"నాక్కూడా అంతే. ఒక పెట్టె సిగరెట్లు తెప్పిస్తారూ?" అన్నది కస్తూరి.

నేను కిందికి వెళ్ళి ఒక పాకెటు మంచి సిగరెట్లు తెచ్చాను. కస్తూరి ఒక సిగరెట్టు తీసి కొద్దిగా వణుకుతున్న చేతుల్తో వెలిగించి, పొగ పీల్చి బయటికి వదులుతూ, "ఇన్నాళ్లూ మిమ్మల్ని సిగరెట్టు తెప్పించమని అడగటానికి భయం వేసింది. మీరు కాల్చరేం?'' అన్నది

నేనుకూడా ఒక సిగరెట్టు అంటించి, "ఇవాళ నేనంటే భయం పోయిందా?" అన్నాను

''పోయింది,'' అన్నది కస్తూరి. "మీతో బయల్దేరినప్పటినించీ మీ మీద ఏదో అదోరకమైన అభిమానం ఉండేది. ఒకపూట మాడేటప్పటికి అదికాస్తా పోయింది" అన్నది గొంతులో ఏ మాత్రమూ ఆగ్రహంగాని, వైషమ్యంగాని లేకుండా.

"నేనే పోగొట్టుకున్నాను కాదూ?'' అన్నాను.

"ఏమో నాకు తెలీదు నన్ను చూస్తే మీ కభిమానం పోలేదా?" అన్నది కస్తూరి.


"నాకు నీమీద అభిమానం ఉండేదని ఎట్లా తెలుసు?"

"తెలీదా? నన్ను మీరు చాలా అభిమానంతోనే చూచారు."

''మరి నిన్ను రంపాన పెట్టి కోశా నన్నావే?''

"దానికేం ? అభిమానం ఉండికూడా అట్లా ఏడిపించారు. కనకనే నాకు కష్టం వేసిం దనుకోరాదూ?''

''రాత్రి నాదగ్గరి కెందు కొచ్చి పడుకున్నావు కస్తూరీ?"




"ఎడంగా పడుకోవటం బాగా ఉండదనిపించింది. దగ్గిర పడుకుంటే సావాసంగా ఉంటుందని!"

"ఇవాళ మళ్ళీ నాదగ్గిర పడుకుంటావా?"

"ఇంకానా? వద్దు బాబూ! బుద్ధొచ్చింది!"

ఇంకో సిగరెట్టు వెలిగించింది—నా సిగరెట్టు కూడా కాకముందే.

"నేను పడుకోమంటే పడుకుంటావా?"

"అడిగి పడుకోబెట్టుకుంటే మీ కే మానందం?"

"నీ అంతట నువ్వు నాదగ్గర పడుకో వన్నమాట?"

"ఎప్పుడన్నా పడుకోవా లనిపిస్తే పడుకుంటానేమో! అది ఎట్లా చెప్పటం?"

నా సంస్కారం ఎక్కడికి పోతుంది! నా సంస్కారం నన్ను గురించి నేను శాశ్వతమైన విషయాలు మాట్లాడేటట్టు చేస్తుంది; నిలుపుకోలేని వాగ్దానాలు చేయిస్తుంది. కస్తూరి కా సంస్కారం లేదు కనక ఆమెకు తన మనస్సు ఏక్షణంలో ఎట్లా ఉందో అదిమాత్రమే తెలుసు.

కస్తూరిమీద నాకు కలిగిన భావం పరిపక్వమై ప్రేమగా పరిణమించదని నిరాశ పుట్టినప్పుడు ఆమెనుంచి క్షణికమైన సుఖం పొందుదామని అదివరకు చేసుకున్న తీర్మానం ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. కాని ఇప్పుడు నా కామె శరీరం కావాలని ఆమెకు తెలిసినా నా కభ్యంతరంలేని క్షణం వచ్చేసిన తరవాత-

ఆమె వల్ల ఆ క్షణికమైన ఆనందం పొందటం - దానికోసం చెయ్యి చాచటం నాకు చాతకాలేదు.

ఇవాళ కూర్చుని ఆలోచిస్తే నాకు స్పష్టంగా తెలుస్తుంది - ఆ క్షణంలో ఆ పిచ్చి కస్తూరిని ప్రేమించటం మొదలుపెట్టి ఉండాలి. ఆ విషయం నా అంత రాత్మ కప్పుడే తెలిసి ఉండాలి -

"కస్తూరీ, నువ్వింటికి వెళ్ళిన తరువాత నన్నుగురించి ఏ మనుకుంటావో అని ఆలోచిస్తున్నాను" అన్నాను.

"ఏం ? మీకు ఆడవాళ్ళంటే అసహ్యం. కోపం అనుకుంటాను. అంతేనా ? లేకపోతే మీ రింకేమన్నా అనుకోమంటే అట్లాగే అనుకుంటా, చెప్పండి" అన్నది కస్తూరి కొంచెం వెటకారంగా.

"ఆ మాట అనుకోలే, నా కభ్యంతరంలేదు. ఇంకోటికూడా అనుకో, నేను మళ్లా ఇంకోసారి నీతో ప్రయాణం చెయ్యటం జరిగితే మొదటినుంచి చివర వరకూ నిన్ను సంతోషపెట్టటానికే ప్రయత్నిస్తా ననుకో. ఇప్పుడు నిన్ను కష్ట పెట్టినదానికి చాలా విచారిస్తున్నా ననుకో. నీవు నన్ను మోసంచెయ్యాలని ప్రయ త్నించినా, నాతో అబద్ధాలాడినా, నన్ను ఎగతాళి పట్టించినాకూడా నేను నిన్ను దయతో చూడవచ్చుకాదూ ? నన్ను నీవుమోసంచేస్తే ఏం ? ఇంతలో నా కయ్యే నష్టమేమిటి ? నీ చేత మోసపోతే నా పరువు పోతుందని భయపడ్డాను. నీకు నా మీద ఘనమైన అభిప్రాయం ఉండాలని ప్రయత్నించాను. నువ్వు అబద్ధా లాడిన సంగతి నాకు తెలిసినట్టు నీకుతెలియాలని ప్రయత్నించాను. ఇకముందా పొరపాటు చెయ్యను" అన్నాను

నేను కస్తూరితో అన్న మాట లిక్కడ రాయటం ఒకవిధంగా వృధా. ఆ మాటలు కస్తూరి కర్థం కావాలని కాని, అవుతయ్యని కాని నా నమ్మకం కాదు. అట్లా మాట్లాడుతూపోతే నా గొంతును కస్తూరి హృదయం అర్థం చేసుకోక పోతుందా అని,

"నేను మిమ్మల్ని మోసం చెయ్యాలని చూడలా ! మీరు చను విచ్చారుగదా అని, ఏమీ అనుకోరులే అని ఏమేమో కోతిపనులుచేశా, నోటి కొచ్చిందల్లా పేలా ! ఇంకా అటువంటిదేమీ చెయ్యనుగా !" అన్నది నేను తనని ఏదో తప్పు పట్టుతున్నా ననుకొని.

"నాకు తెలుసును !" అన్నాను ఇంకో సిగరెట్టు తీస్తూ,

"అలవాటు లేకపోతే కాల్చకండి పాడుసిగిరెట్టు. నా గొంతంతా మండు తున్నది'' అన్నది కస్తూరి.

నేను లేచి కూజాలో నీళ్ళు కప్పులోపోసి కస్తూరికి తాగటాని కిచ్చాను.

"నేను పోయి తెచ్చుకోనూ" అన్నది కస్తూరి, కప్పు తీసుకునేటప్పుడు నా వంక కృతజ్ఞతతో చూస్తూ.

కప్పు నీళ్ళందించినందుకు ఒక మనిషి కళ్ళలో అంతకృతజ్ఞత కనిపించనా? అని నా అంతస్సు విస్మయపడింది.

"నా నిద్దరంతా పోయింది సిగరెట్టు మూలకంగా. అయినా ప్రయత్నిస్తాను. నువు పడుకునేటప్పుడు దీపం ఆర్పేస్తావు కదూ?" అన్నాను.

కస్తూరి చప్పున దీపం ఆర్పేసి వెళ్ళి తన మంచంమీద పడుకుంది.

నా మనస్సులో ఏదో వెలితి తోచింది. ఏదో తుపాను - ఏదో గాలిదుమారం ఉన్నంతసేపూ బాధపెట్టి అయిపోగానే ఆలోచించేటందు కేమీలేని శూన్యం కల్పించి పోయినట్టయింది.

నిన్న ఈ పాటికి కస్తూరి ఇల్లాగే దీపం ఆర్పి నా పక్కలో వచ్చిపడుకున్నది. నేను పక్కమీద అటూ ఇటూ పొర్లసాగాను. పరుపంతా వేడెక్కినట్టు తోచింది. కింద చల్లని గచ్చుమీద పడుకుందా మనిపించింది.

"కస్తూరీ!''

"ఊఁ''

రైల్లో పాడావే, ఆ జావళీ ఒకటి పాడు. మరీ బూతులు లేనిదిగా చూచి?''

కస్తూరి లేచి దీపం వెలిగించి నా మంచందగ్గిరకి వచ్చి చేతులు వెనక పెట్టు కొని నిలబడి నా కేసి చిరునవ్వు నవ్వుతూ చూడసాగింది.

"ఏమిటది?" అన్నాను ఏ మాత్రమో కంగారుపడి.

"ఆ మొహం ఏమిటో చూదా మని!'' అన్నది కస్తూరి.

"మంచంమీద కూర్చో!'' అన్నాను.

ఇంకా నవ్వుతోనే కూర్చున్నది. నాకు కళ్ళు మసకలయినట్టయిపోయింది. కస్తూరికేసి చేతులు చాచాను. కస్తూరి మొహాన చిరునవ్వు మాయం కావటం చూశాను. ఆమె నా చేతులకు తన చేతు లందించింది. నేను నిర్జీవమై తోటకూర కాడల్లే అయిపోతున్న చేతులతో బలంగా కస్తూరిని నామీదికి లాక్కున్నాను.

అప్పటికీ కస్తూరి తనమొహం నామొహానికి తాకనివ్వలేదు. నా మొహమంతా తనకళ్లు పంపి తీవ్రంగా పరీక్షించింది. నే నా పరీక్షకు తట్టుకోలేక పోయినాను.

పరీక్షలో నేను ఓడిపోయి గెలిచాను. నా మొహంలో కనిపించిన దౌర్బల్యం కస్తూరికి తృప్తి కలిగించిఉండాలి. తనమొహం నా మొహానికి ఆనించింది. నా మూతి ఆమె మొహం తడివి ఆమె మూతిని చేరుకోగలిగింది.

"కస్తూరీ ?'' అన్నాను ఊపిరి తెప్పరించుకుని.

"అయిదూ !" అన్నది కస్తూరి.

"ఏమి టయిదు ?"

"నన్ను మీరీపూట పేరుపెట్టి పిలవటం ఇది ఐదోసారి."

"అయితే ?"

"బాగుంది. నన్ను మీరు ఎప్పుడోతప్ప పేరుపెట్టి పిలవరు ఎందుకనీ ?"

"నా ఖర్మం."

''ఏమిటో చెప్పొచ్చారు ?"

"ఆ దీపం ఆర్పిరా ! వెలుతుర్లో నిన్ను చూస్తే భయమేస్తున్నది."

''నే నార్పను. నేను మీ మొహం చూడాలి."

కస్తూరిని మళ్ళా ఇంకోసారి ఘోరంగా ముద్దుపెట్టుకున్నాను.

"ఇంత ఆపేక్ష ఇదివరకల్లా ఏమయింది ?" అన్నది కస్తూరి, నిన్నటిమాదిరి గానే నా పక్కన పడుకుంటూ.

విచిత్ర మేమంటే ఆ క్షణానకూడా నన్ను కట్టలు తెంచే ఉద్రేకం ఆవేశించ లేదు. నా మొహాన్ని ఎంత నాజూకుగా, ఎంత అందంగా బయటపెట్టడానికి వీలుందో అంతమాత్రం నిగ్రహం నా కింకా దక్కింది.

"అమ్మో, నీ దెంత రాతిగుండె !" అన్నది కస్తూరి.

"ఇంత ఆపేక్ష లోప లుంచుకుని నిన్న రాయల్లే పడుకున్నావే !" అన్నది ఆశ్చర్యంతో.

నాకోసం ఆ రాత్రి కస్తూరి ఇంకో మని షయిపోయిందంటే ఆశ్చర్యం లేదు. పైకి చెప్పదగిన భావాలూ, చెప్పటానికి మాటల్లేని భావాలూ అర్థం చేసుకో గలిగింది.

మా శరీరాలు పరస్పరాలింగనం చేసుకోవటం వింతకాదు. ఒకరినొకరు మన స్ఫూర్తిగా ద్వేషించుకుంటూ ఎందరు దంపతులు రోజూ ఆ పని చేస్తున్నారో ! శరీరాల వెంట మనస్సులూ ఆత్మలుకూడా ఆలింగనం చేసుకోవటం చాలా వింత అయిన విషయం. నేనదివరకు ఒక భార్యతో కాపరం చేసి, కొందరు పరస్త్రీలతో అత్యాచారం చేసినవాణ్ణయినప్పటికీ ఈ అనుభవం నా కదివర కెన్నడూ కలగ



లేదు. శరీరాలు పెనవేసుకొన్నా మనస్సులో ఆత్మలో ఒకదాని కొకటి అడ్డం తిరగటమూ, అంటకపోవటమూ మాత్రమే నా కదివరకు అనుభవం ఉండింది.

నేను మొదటిసారి ముద్దు పెట్టుకున్న క్షణంనించీ, కస్తూరి గొంతులోకి ఏదో మార్పు వచ్చింది. అదివరకల్లా నాచేతిలో పడి మనస్సును చేరి అక్కడ రక రకాల తరంగాలు సృష్టించిన కస్తూరి గొంతు ఇప్పుడు చెవులద్వారా మనస్సును చేరి అక్కడ ఉండే అశాంతి – ఏదన్నా ఉంటే – రహితం చేసి, అక్కడగూడా ఆగకుండా నా ఆత్మను చేరుకో సాగింది. అటువంటి అనుభవం కలగనివాళ్ళు

దురదృష్టవంతులు. ఒక్కసారి అనుభవం కావటంకోసం ప్రతివ్యక్తి వెయ్యి సార్లయినా నీతిని ఉల్లంఘించవచ్చునేమో ననుకుంటాను.

## 10

ప్రపంచపు విలవలు నాకు నిజంగా తెలియవు. అందుచేత ఈ క్రింది విష యాలు చెబితే నన్ను ఎట్లా చూడాలో ప్రపంచానికి తెలిసిరావచ్చును. నేనేమో గొప్పవాణ్ణనికాని, కస్తూరి ఎంతో లోకోత్తరమైన మనిషి అయిఉండకపోతే నేను ప్రేమించననీ అనుకొని ఎవరూ పొరపాటుపడడం నా కిష్టం లేదు.

నేను ప్రేమించి కస్తూరిని స్పృశించ లేదు. కామించే స్పృశించాను. కాని అంతకు పూర్వమే ఆమె ప్రేమ సంపాదించాలనే కోరిక నాలో గూడుకట్ట నారం భించిందని నా అనుమానం. నే నిదివరకు స్పృశించినవా రందర్నీ ప్రేమించ లేదు_ ప్రేమించా ననే భ్రమకూడా ఒక్కసారే పడ్డాను.

నిజానికి నాకోసం కస్తూరి ఎట్లామారబోతుందో నేను కలలోకూడా ఊహించ లేదు. నా ప్రేమ సంపాదించాలనే కోరిక ఆమెలోకూడా పుట్టి ఉండాలి. మా ఇద్దరి ప్రయత్నాలూ కలిసివచ్చినై.

కస్తూరి తన ప్రేమను నా శరీరం మీదే ప్రయోగించలేదు. నా చొక్కా గుండీలు పెట్టేటప్పు డామె వేళ్ళు నన్ను ప్రేమించటం గమనించాను. నాకు కప్పులోనుంచి నీళ్ళందించే టప్పుడామె చేతుల్లో ప్రేమ చూశాను. నే నింకా నిద్రలేవలేదనుకుని నిశ్శబ్దంగా కస్తూరి ఆపనీ, ఈపని చేస్తుంటే బిగబట్టిన ఆమె నరనరంలోనూ నేను ప్రేమ ఊహించాను.

నోరు చేసుకుని కస్తూరి "నిన్ను ప్రేమించాను" అని ఎన్నడూ అనలేదు. కాని నామీది ప్రేమ బయట పెట్టకుండా ఆమె ఏపనీ చెయ్యలేదు. మనస్సింకో విషయంమీద ఉన్నప్పుడు కూడా నన్ను కస్తూరి తన హృదయంలో ఏ మారు మూలో దాచుకునేది. దానికి గుర్తేమిటంటే మళ్ళీ ఆమె మనస్సులోకి నా ఆలో చన వచ్చినప్పుడు నేను ఆమె మనస్సు అడుగునించి పైకి వచ్చేవాణ్ణి; కాని బయటినుంచి వచ్చి మనస్సులో పడేవాణ్ణి కాదు. అనేక గంటలపాటు కస్తూరికి తెలియకుండా ఆమెను గమనించి నేనీ విషయాలు తెలుసుకున్నాను. నా మాటల్లో విశ్వాసం లేకపోతే ఈసారి మీరు మిమ్మల్ని ప్రేమించే భార్యలను శ్రద్ధగా గమనించండి.

నేను ప్రేమించటం ప్రారంభించక పూర్వం కస్తూరి దాదాపు అందరి వేశ్యల వంటిదీనూ; ఆ తరువాత కస్తూరి నా ప్రాణానికి ఒక దేవత. నా కోసం

మారిందికదా అని కస్తూరి అందరికోసమూ మారిందని నేను చెప్పను. ఆమె ఈ క్షణానకూడా ఇతరులకు దాదాపు అందరి వేశ్యల వంటిదే కావచ్చు. నేను దానికి జవాబుదారీ కాదు.

నేను కస్తూరిని ప్రేమించటానికి చిల్లిగవ్వ త్యాగం చెయ్యలేదు. ఆఖరుకు నా శీలాన్నికూడా పోగొట్టుకోలేదు. ఆ శీలాన్ని పోగొట్టుకోడానికి తీర్మానించిన తరవాతనే నా ప్రణయం ప్రారంభమయింది. అనుభవం లేకపోవటం వల్ల – అయిన అనుభవం అర్థంకాక పోవటం వల్ల – నేను ఒక చిన్న పొరపాటు చేశాను. ప్రేమ పరిపూర్ణం అయిన తరవాతనే కస్తూరిని స్పృశింతా మనుకున్నాను. కాని స్పర్శతోకాని ప్రణయం ప్రారంభం కాదనీ ఒకసారి ప్రారంభమైనతరువాత దాని పరిణామం సక్రమంగా ఉండటం నా ఆత్మబలంమీద ఆధారపడి వుందనీ నాకర్థం కాలేదు. నా ప్రణయం పరిణామం పొందటంలో కూడా నేను ఎంత స్వల్పమైన త్యాగంకూడా చెయ్యలేదు. కస్తూరిని దేవతనెట్లా ఆరాధించాలో అట్లా ఆరాధించటానికి నా నోటివెంట నా హృదయం విశ్వసించని ముక్కగాని మనస్సుతో సమాధానపడవలసిన ఒక్క చేత గాని నా కవసరం లేకపోయింది. నా ప్రేమపరిణామం కంటె సహజమైనది సృష్టిలో ఇంకొకటి ఉండబోదు.

నేను కావాలని కస్తూరితో కవిత్వం మాట్లాడలేదు, కస్తూరి కావాలన్నా కవిత్వం మాట్లాడగలిగి ఉండదు. కాని కస్తూరి మాట్లాడిన మాటలు నాకు కవిత్వసార మని తెలిసేది. నేడు మాట్లాడినప్పుడుకూడా నా మాటల్లో ఉండటానికి వీల్లేని ఆనందం పొందుతున్నట్టు కస్తూరి నాకు అర్థమవుతూవుండేది.

మా ప్రణయం మా తలలకెక్కి మాకు ఉన్మాదంగాని, మత్తుగాని ఎక్కించ లేదు. పైగా అది మా ఇద్దరి కళ్లూ తెరిచింది. అనేక సమస్యలను తెచ్చిపెట్టింది.

మర్నాడు నేను మాప్రయాణం విషయం ఎత్తినప్పుడు కస్తూరి, "నే నెట్లా పొయ్యేది ? నన్నెందు కింత పిచ్చిముండను చేశావు ? ఇప్పుడు నన్నింటికి పంపిస్తే ఎందులోనన్నా దూకుతాను !" అన్నది

నాక్కూడా కస్తూరి సమస్యే అయింది. అయిదునిమిషాలు స్నానం చేసి రావటానికి కళ్ళఎదుట లేకుండాపోతే నేను కస్తూరికోసం మొహం వాచిపోవటం జరిగితే ముందుముందు నా గతి ఏం కావాలి ?


"కొంత కాలం గడిస్తే ఇంత అన్యాయంగా ఉండదేమోలే!" అన్నది కస్తూరి నాకు ధైర్యం ఇస్తూ.

కస్తూరి నన్నింకోవిధంగాకూడా తికమక పరిచింది. అదివరకు నాకు మానసిక ప్రవృత్తులేవో, దైహిక ప్రవృత్తులేవో ఖచ్చితంగా తెలిసేవి. కస్తూరి వాటన్నిటినీ ఒక్క వుండచుట్టి ఏది ఏదో తెలియకుండా చేసింది. వయస్సుచేత నేను యవ్వనవార్థక్యంలో ఉండి కొద్దికాలంలో నడివయస్సుయొక్క యవ్వనంలో పడబోతున్నవాణ్ని. ఏ ఇరవై యేళ్ళ యువకుడికోవుండే కామోద్రేకం నాలో వుండవలసిన అగత్యంలేదు. కాని కస్తూరి నాలో కలిగించే వాంఛలు ఎంతో ఉద్రేకంతో కూడుకునివుండేవి. పైగా అవి ఒక్కొక్కప్పుడు దైహికంగా వుండేవి. ఒక్కొక్కప్పుడు మానసికంగావుండేవి. నా యవ్వనారంభములో కూడా నేను ఆడదాని జుట్టు ముట్టుకుందా మనో; లేకపోతే ఒక ఆడదాని పేరు నోట ఉచ్చరించాలనో ఇంతగా ఉద్రేకపడి ఎరగను. "కస్తూరీ!" అని పిలిచేటందుకు అవకాశం ఒక అరగంటపాటు దొరక్కపోతే నేను శారీరకంగా బాధపడ్డ సమయాలున్నై.

కస్తూరిలో ఇంకో మార్పు గమనించాను. అదివరకు నన్ను పనిపెట్టుకునీ, నన్నానుకుని కూర్చునీ, నిష్కారణంగా నా మీద చెయ్యివేసీ "సావాసం" ప్రకటించిన మనిషి ఇప్పుడు పిసినిగొట్టయిపోయింది. అకారణంగా నన్ను స్పృశించదు. తన స్పర్శకు ఏదో అర్థం ఉండేట్టుచేసి దాన్ని భావ ప్రకటన క్రింద ఉపయోగిస్తుంది.

నేనీ విధంగా కస్తూరిని ఎనలైజుచేసి విమర్శించి ఉండటం ఆమెకు ద్రోహమేమో, అయినా అటువంటి పనిచేశాను. నేనా మనిషి ప్రేమ సంపాదించటానికి ఉపక్రమించిన తరవాతకూడా ఆ మనిషి నాకిచ్చే ప్రేమలో ఏమాత్రం అపస్వరం కాని, కృతజ్ఞతగాని ఉందేమోనని ఒక చెంప పరీక్షిస్తూవచ్చాను. అటువంటి పరీక్ష ఎంత దారుణమైనప్పటికీ, ఆ పరీక్షే నాకామె ప్రేమయొక్క విలవ అంచనా కట్టడానికి సహాయపడింది.

నా పరీక్షవల్ల అమె ప్రేమలో ఏమైనా అపస్వరం ఉన్నట్టుతోస్తే ఏం చేసివుండేవాణ్ని? బహుశా ఆ కాస్త కాలుష్యమూ కడిగివెయ్యటానికి నా ఆత్మశక్తి అంతా వినియోగించినా ఆ కాలుష్యం కడగరానిదని తెలిసినట్టయితే నా ప్రేమకు పతనం ప్రారంభమై వుండేది.




## 11

"మన మిక్కడ డబ్బుతగలేస్తూ ఎంతకాలం కూర్చుందాం?" అన్నది కస్తూరి.

"ఏం చేద్దాం?" అన్నాను.

"ఈ డబ్బంతా వీళ్ళ మొహాన పోస్తే ఎవడు తిన్నట్టు?"

"హోటలువాళ్ళు తిన్నట్టు."

"కనకనే ఇంటికి పోదాం."

"మళ్ళీ నీవు నీ వృత్తిలో పడతావు. నేను?"

"హాయిగా పెళ్ళిచేసుకుని సుఖంగా వుండు."

''ఎవర్ని పెళ్ళిచేసుకునేది. నిన్ను ముట్టుకుని నేను చెడిపోయినాను కదా. నన్నెవతె పెళ్ళాడుతుంది?''

"నేను పనికొచ్చిం తరవాతనీకు పనికిరాని దంటూ వుంటుందేమిటి? ఎవతెనో ఒకతెను పెళ్ళాడు."

"నీవంటిది దొరికితే పెళ్ళాడేస్తాను. ఎక్కడన్నా వుంటే చూడు."

"ఎక్కడపడితే అక్కడున్నారు – నా బాబులంటాళ్ళు!"

''ఉండొచ్చు. కాని నే నెక్కడా చూడలేదు. ఓ వంద సంవత్సరాలు తిర్గితే నీ బాబంటిది దొరుకుతుందేమో! ఈ లోపల?"

కస్తూరి నాకేసి నిశ్చలంగా చూచి, "వందసంవత్సరాలెతుకుతావేం?" అన్నది.

"నీకన్న మంచిది ఈ లోపలే కనబడుతుం దంటావా? ఒకవేళ నీకన్న మంచిది దొరికినా అంత మంచిదాన్ని నే నేం చేసుకోను? నాకు నీ వంటిది కావాలి.''

"నే నెక్కడ తెచ్చేది నావంటి దాన్ని?" అన్నది కస్తూరి నా భుజానికి తన తల చేర్చి.

"కస్తూరీ, నా గుండెకాస్తా దొంగిలించుకుని నీ దారిన నీవు పోతే నే నింకా కత్తె కే మివ్వను?"

"చాల్లే? నేను దగ్గరుండబట్టే నీకి తిక్క! వారంరోజులు నేను దగ్గిర లేకపోతే నన్ను మరిచిపోవా? నాకు మగవాళ్ళసంగతి తెలీదా?" అన్నది కస్తూరి.

''ఇతరుల మాట ఎట్లావున్నా? నా సంగతి నీకు తెలీదని ఎట్లా చెప్పను?''

కాస్సేపు నన్ను పరీక్షగా చూసి కస్తూరి, ''కోపం వచ్చిందా?" అన్నది.

"కొంచంగా'' అన్నాను.

కస్తూరి నన్ను కౌగలించుకుని "మా అమ్మకూడా దగ్గిర్లేదుకదా, నీకో్కపం వస్తే ఏమౌతాను చెప్పు?" అన్నది.

"అయితే ఎప్పుడు పోదాం? ఇవాళ పోదామా?" అన్నాను.

''తలచుకున్నరోజే తాతపెళ్లా, పోదాం రేపో, ఎల్లుండో!"

పోదామని నిర్ణయించుకోటం కస్తూరి అంతరాత్మ కేదో శాంతి నిచ్చింది. కాని వెళ్ళిపోవాలనే కోరిక నా కెంత ఉందో కస్తూరికీ అంతే ఉంది. ఎప్పటి కప్పుడు రేపో. ఎల్లుండో పోదామనుకుంటూ పదిహేను రోజులు గడిపాం.

ఇంతలో రమామణి దగ్గిర్నించి ఉత్తరం వచ్చింది, తనకు ఒంట్లో బాగుంటం లేదు, ఒకసారివచ్చి కావాలంటే మళ్ళీ వెళ్ళమని.

ఇక మా ప్రయాణం తప్పలేదు.

బెజవాడ ఒక్కొక్క మైలే దగ్గిరవుతున్నకొద్దీ కస్తూరికి ఏదో దయ్యం పట్టి నట్టుఖుంది. ఒక్కసారయినా పొరపాటున కూడా నవ్వలేదు.

"మా యిల్లు ఇంకా మూడొందల మైళ్ళ దూరంలో వుంది'' అని నే ననే టప్పటికి చప్పున మొహం బయటికి తిప్పుకుని ముక్కు చీదుకున్నది.

కస్తూరిని చూస్తే నాకు చాలా జాలేసింది. ఆ క్షణం వరకూ నా సంగతే నేను విచారించానుగాని కస్తూరిని కూడా లోపల బాధపడుతున్న దనీ, ఆమెను అనునయించే బాధ్యత నామీద వుందనీ నేను గుర్తించలేదు.

ఆమెను బలవంతాన నావేపు తిప్పుకుని వంచుకున్న మొహం పైకెత్తి, "నీకేమన్నా పిచ్చా ఏమిటి ? ఆ హోటల్లో కూచుని తిరిగ్గా ఏం నాటక మాడామో ఆడాం ! అదంతా ఇంటికి పట్టుకుపోతావా ? నీ వన్నట్టు నేను మరో వారం రోజుల్లో నిన్ను మరచిపోనా ! నిన్నుగురించి జ్ఞాపకం పెట్టుకునేటందుకు అఖరుకు నువ్విదా ఇచ్చేది ?'' అన్నాను.

కస్తూరి తన ఏడుపు దిగమింగటానికి ప్రయత్నం చేసింది, కాని మాట్లాడలేదు.

"నాఒళ్లో తలపెట్టుకు పడుకో. నీకోకథ చెబుతాను" అన్నాను. చిన్న పిల్లలు పెద్దవాళ్ళ అజ్ఞను పాలించినట్టు నా వంక చూడసాగింది.

''అదివర కొకసారి ఇట్టాగే పట్నంలో నాకోమనిషి తగిలింది. అబ్బో ! అ మనిషిని నీకన్న వెర్రివాడల్లే వెంట పడ్డాను—"

కస్తూరి తలవంచి, "నాకేసిచూస్తూ చెప్పు !" అన్నది. కస్తూరికేసి చూస్తూ, నేను నోరు విప్పలేదు.

''చెప్పుమరీ," అన్నది కస్తూరి. "వెంటపడితే ?"

నేను వంగి కస్తూరిని ముద్దుపెట్టుకుని, "కథలు చెప్పేవాళ్ళు వినేవాళ్ళవంక ఇట్లా చూస్తూ చెప్పరు. ఏ గదిలోనో తలుపు వేసుకుని కూర్చుని రాసి పత్రికల్లో వేస్తారు. లేకపోతే కథలు చెప్పేవాళ్ళూ వుండరు వివేవాళ్ళూ వుండరు !'' అన్నాను.

''కథలనిపేరుపెట్టి అంత అబద్ధాలు చెప్పకపోతే ఏం ?'' అన్నది; ఒక్క ముక్కతో కథాసాహిత్యం యావత్తూ తోసి పారేస్తూ.

అదివరకల్లా అయిపోయిందేమోనని భయం కలిగించిన ప్రయాణం చివర వందమైళ్ళలోనూ ఎప్పుడైపోతుందా అనిపించింది. నా నరాలు ఇంక తట్టుకోలేవనేదాకా వచ్చింది నా స్థితి. కస్తూరికీ అట్లాగే అయిఉండాలి. మేమిద్దరమూ చివరగంటకాలంలో దాదాపు ఏమీ మాట్లాడలేదు.

రాత్రి పదిగంటలవేళకు చచ్చిచెడి బెజవాడ చేరుకున్నాం.

ఇద్దరమూ ప్లాట్‌ఫారంమీదికి దిగాం. కస్తూరి నా మొహంతప్ప ఇంకేమీ చూడటంలేదు. నాకామె మొహం చూడటానికి భయంవేసింది. బలవంతాన నిగ్రహిస్తున్న ఉద్రేకంతో ఆమె మొహం భయంకరంగా ఉంది. ఆమె అక్కడే పుటిక్కిన ఏడుస్తుందేమోనని నా గుండె దడదడ లాడుతున్నది.

మా అంపకాలు అదివరకే అయినై. గుంటూరు వెళ్ళగానే నన్ను ఉత్తరం రాయమన్నది. కస్తూరి ఇంటికి వెళ్ళేట్టూ నేను గుంటూరుబండీ ఎక్కేటట్టూ ఏర్పాటుచేసుకున్నాం. కొంతసామాను గుంటూరుబండిలో పెట్టాలనీ, మిగిలింది బ్రిడ్జి దాటించాలనీ పోర్టరుతో చెప్పాను. వాడు ఏ సామా నేంచెయ్యాలో చెప్ప మని నన్ను సతాయిస్తున్నాడుకూడానూ.

కస్తూరి వణుకుతున్న గొంతుతో, "నేను ఒక్కత్తెనూ పోలేను. మీరుకూడా రండి!" అన్నది, మళ్ళా వెనకటల్లేనే మర్యాదగా సంబోధిస్తూ.

"సామానంతా ఓవరుబ్రిడ్జి దాటేయించు" అన్నాను పోర్టరుతో, కస్తూరి మొహం వెలిగిన దీపమైంది.

రమామణి స్వయంగా వచ్చి మాకు తలుపు తీసింది. మొద్దల్లె ఉంది ఏజబ్బూలేదు. నన్నుచూసి మీదుమిక్కిలి మొహం చిట్లించింది. కస్తూరి తల్లికేసి ఒక్కచూపు చూసి ఆమె వేసిన ఒక్కప్రశ్నకుకూడా సమాధానం ఇవ్వకుండా నన్ను తనగదిలోకి తీసుకుపోయి, నేను పడుకునే ఏర్పాటు చెయ్యటం మొదలు పెట్టింది. నేను పడుకున్న తరవాత తలుపుమూసి అవతలికి వెళ్ళింది. తల్లీ కూతుళ్ళ సంభాషణ వినిపిస్తుందేమోనని జాగర్తగా ఆలకించాను. ఎక్కడా చడీ చప్పుడూ లేదు.

మరో పదినిమిషాలకి తుపానల్లే వచ్చింది కస్తూరి. ధభీమని తలుపువేసి ఆమోతలో కలిసిపొయ్యేట్టు గడియ వేసింది.

"ఏమిటిది?" అన్నాను.

"దానిబొందా. నాబొందా! ఎవడోవచ్చి ఎక్కడో లక్షాధికారిని నాకోసం మాట్లాడతా నన్నాట్ట. ఆ ఉత్తరంరాసింది, దీనగ్గారా! దబ్బంటే పడిచస్తది!

ఆ రాత్రి కస్తూరి తన తల్లిమీద కోపమూ, నా మీది పగా నామీదనే తీర్చు కున్నది. నన్ను నూరుకు తాగటం తన వశమైతే కస్తూరి ఆ పనికూడా చేసి ఉండేదే!


## 12

"కస్తూరీ, నన్ను పెళ్ళాడతావా?" అన్నాను.

"ఆడను!" అన్నది కస్తూరి ఖచ్చితంగా.

"ఏం?"

"నీ పెళ్ళామై ఏంచెయ్యాలో నాకు తెలీదు."




"ఏమీ చెయ్యనక్కరలేదు. నన్ను చెడిపోకుండా చూస్తూ ఉండటమే. నీవు దగ్గరలేకపోతే నేను తప్పకుండా చెడిపోతాను."

"దగ్గర ఉండటానికి పెళ్ళిచేసుకోవాలా ఏమిటి ?"

"అయితే మా యింట్లో వచ్చి ఉండు."

"ఉండను."

"ఏం ?"

"మీ ఇంట్లో వచ్చిఉంటే నేను కుక్కకన్న నీచం అయిపోనా ? నా ఇంట్లో నేను రాణిని. నన్నడిగేవాడుండడు.".

"అయితే నీకు నేనవసరంలేదా ? నాతో అక్కర తీరిపోయిందా ?"

"నీకోసం చచ్చిపోతున్నానని ఒక ఉత్తరంముక్క రాస్తే రానా ? నీకెప్పుడు కావాలంటే అప్పుడు నేను తలుపు తెరవనా ? అంతకంటె ఏంకావాలి మనకు ?"

"బెజవాడకూ గుంటూరుకూ ఎంతదూరమో చూడు ? అది జ్ఞాపకంవస్తే నా గుండె పగిలిపోతుందే !"

"పోనీ నేను గుంటూరు రానా ?" అన్నది కస్తూరి.

"వస్తావా ? తప్పకుండా రా ! మాయింటికిదగ్గరగా ఇల్లుతీసుకుని ఎప్పుడూ మీ ఇంట్లోనే పడిఉంటాను. దానికి సమ్మతమేనా ?"

"ఓ ! నా ఇల్లంటూ నాకుండి, నా కులం నాకుండి, నన్ను ఒకడు అదుపు చెయ్యటానికి లేకుండా ఉంటే నన్నేంచేసినాఇష్టమే. రోజుల్లా నాకు కాపలాకాయి

ఒద్దంటే ఒట్టుపెట్టు, ఇంకెవరివంకా చూడగూడదని ఆజ్ఞాపించు. ఒప్పుకుంటా, నీ కిష్టంలేనిపని చేస్తే మక్కెలిరగదన్ను, పడతా. నీ కున్నప్పుడు పెట్టు లేకపోతే పస్తుపడుకోబెట్టు, అదైనా ఇష్టమే. తెనాలి రామలింగడు నల్లకుక్కను గంగిగోవు చేసినట్టు నన్ను బానిసదాన్ని చెయ్యాలంటేమాత్రం నా కక్కర్లా! నే నెవరి పెళ్ళాన్నీకాను. బోగం ముండని!" అన్నది కస్తూరి.

"నాకింకా స్నేహితుల్లేరా, బంధువుల్లేరా? నల్లకుక్కనుతెచ్చి నా భార్య అంటే నెత్తిన పెట్టుకునేవాళ్ళున్నారు. వాళ్ళందరూ నాతోపాటు నిన్నూ ఆమోదిస్తారు. వాళ్ళకోసమైనా నా యింట్లో ఉండలేవా?"

"నల్లకుక్కనుతెచ్చి నా భార్యఅంటే నెత్తినపెట్టుకునేవాళ్ళు కస్తూరిని తెచ్చి నాముండ అంటే నెత్తిన పెట్టుకోరా? నీఇంట్లో నేనుంటే నన్ను చూడవచ్చేవాళ్లు నాయింటో నువ్వుంటే నిన్ను చూడరారా? నేను నీఇంట్లో ఉంటే చూడవచ్చే వాళ్లు నన్నామోదించారని నా కెట్లాగుర్తు? నువ్వు నా ఇంట్లో ఉంటే చూడ వచ్చేవాళ్ళు నన్నామోదించారని నాకు నమ్మకమే. నీమీద ప్రేమవుండి నేనంటే ఇష్టంలేనివాళ్ళని నానెత్తిన తెచ్చిపెట్టకు నా కంతకన్న ఇంకేమీ అక్కర్లేదు."

"నేను మళ్లా రేపు వస్తాను. నాకు రైలువేళ అయింది."

వాకిలిదాకా వెళ్లినతరవాత కస్తూరి నన్ను వెనక్కు పిలిచి, "నా కోసం ఇవాళ్ళ ఎవరైనా వస్తే ఏం చెప్పమన్నావు?" అన్నది కొంటెగా నవ్వుతూ.

"మనకు ఆప్తులైతే లోపలికిరానీ, లేకపోతే ఈ మధ్య చెడిపోయినానని చెప్పు!"

"ఓసి పండూ!" నన్ను బలవంతంగా ముద్దుపెట్టుకున్నది. "ఇంకోమాట. మీ స్నేహితుడు, భావనారాయణగారు; ఆయనొ్నకసారి వచ్చి నన్ను చూసి పోమని చెప్పవూ?"

"చెబుతానుగాని అతన్ని నాకంటె అపేక్షగా చూస్తే నేనూరుకోను!" అన్నాను.

"అమ్మో! ఎంతసూయే! ఎంత ఓర్వలేనితనమే!" నా బుగ్గ గంటుపడేటట్లు కొరికి, అది మానటాని కొాక చిన్న ముద్దుపెట్టి నన్ను సాగనంపింది.

రైల్లో కూచుని ఆలోచించాను. మనిషికి కావలసిందేమిటి? ఆత్మరక్షణ. అది జాస్తిగా డబ్బువల్ల సాధ్యమవుతుంది కనక డబ్బే జీవితాశయం. కాని డబ్బు కతీతమైన ఆత్మరక్షణోపాయాలు జీవితంలో లేకపోలేదు. అవి చదువుకున్న నాబోటిగాడికి తెలియవు. కస్తూరివంటిదానికే తెలియాలి.

——